


'రాజముద్ర' తెలుగు దినపత్రికలో
ప్రకటనల కోసం సంప్రదించగలరు
సెల్ : 9182 474 575



www.rajamudranews.com

అక్షర
# రాజముద్ర

ప్రతి అక్షరం - ప్రజల కోసం
తెలుగు దిన పత్రిక

AKSHARA RAJAAMUDHRA
RNI No: TELTEL/2024/86684

| మేడ్చల్-మల్కాజ్‌గిరి | సోమవారం | 05.01.2026 | సంపుటి : 2 | సంచిక :330 | పేజీలు : 8 | వెల : 2/- |
|---|---|---|---|---|---|---|
| MEDCHAL-MALKAJGIRI | Monday | 05.01.2026 | volume : 2 | Issue : 330 | Pages : 8 | Cost : 2/- |



విలేకరులు కావలెను

'రాజముద్ర' తెలుగు దినపత్రికలో పని చేయుటకు జిల్లాలు మరియు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. తెలుగు భాషలో ప్రావీణ్యం, ప్రజా సమస్యలపై పోరాట స్ఫూర్తి, సమస్యలపై గళమెత్తగల వ్యక్తిత్వం, కలంతో ప్రశ్నించే ధైర్యం ఉన్నవారికి ఆహ్వానం పలుకుతోంది.

సంప్రదించాల్సిన చిరునామా..

సెల్ : 9182 474 575


# తెలంగాణకు నంబర్-1 విలన్ కాంగ్రెస్

## రేవంత్‌ది కట్టుకథ.. కుట్రతో ప్రాజెక్ట్‌ల నిర్లక్ష్యం



**శాసన సభను సీఎం తప్పుదోవ పట్టించారు**

**తొలి ఎపెక్స్ కౌన్సిల్ సమావేశంలోనే ట్రైబ్యునల్ ఏర్పాటుపై ప్రశ్నించాం**

**సెక్షన్-3 కావాలని కేసీఆర్ 32 లేఖలు రాశారు - టెలిమెట్రీలు పెట్టాలనీ కోరారు**

**రాయలసీమ ఎత్తిపోతలపై సీఎం వ్యాఖ్యలను ఏపీ ప్రభుత్వం ఖండించింది**

**పవర్‌పాయింట్ ప్రజంటేషన్‌లో బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు**

'నదీ జలాలు- కాంగ్రెస్ ద్రోహులు' పేరిట భారత రాష్ట్ర సమితి ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్‌రావు తెలంగాణ భవన్‌లో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. తెలంగాణకు నంబర్ 1 విలన్ కాంగ్రెస్ పార్టీనేనని అన్నారు. "తెలంగాణను గతంలో ఏపీలో కలిపి కాంగ్రెస్ పార్టీ మరణ శాసనం రాసింది. ఆ పార్టీ తెచ్చిన ఆయకట్టు కన్నా ఏడున్నర రెట్లు బీఆర్ఎస్ సాధించింది.

హైదరాబాద్, జనవరి 4: తాత్కాలిక సర్దుబాటు కిందే నీటి వాటాలకు కేసీఆర్ ఒప్పుకొన్నారు. శాసన సభను సీఎం రేవంత్‌రెడ్డి తప్పుదోవ పట్టించారు. రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుకు 34,720 క్యూసెక్కులు పోతున్నాయని మంత్రి ఉత్తమ్ అన్నారు. పాలమూరు రంగారెడ్డికి 4 అనుమతులే వచ్చాయని అసెంబ్లీలో చెప్పారు. పాలమూరు ప్రాజెక్టుకు 2 టీఎంసీల నుంచి ఒక టీఎంసీకి తగ్గించిందని అబద్ధం చెప్పారు. పాలమూరుకు కాంగ్రెస్, తెదేపా చేసిన ద్రోహాలను రేవంత్‌రెడ్డి కొనసాగిస్తున్నారు. ఏపీలో కలవకముందు తెలంగాణలో 16.03 లక్షల ఆయకట్టు ఉంది. ప్రస్తుతం తెలంగాణలో 48.74

-మిగతా 2 లో..



# ప్రభుత్వం తరఫున సమర్థ వాదనలు వినిపించాలి

**'సుప్రీం' న్యాయవాది సింఘ్వీకి సూచించిన సీఎం రేవంత్‌రెడ్డి**

**పోలవరం-నల్లమలసాగర్‌లింక్ ప్రాజెక్టును అడ్డుకునేందుకు సీనియర్ న్యాయ నిపుణులతో చర్చలు**

**సుప్రీంకోర్టులో నేడు విచారణకు రానున్న కేసు**

గోదావరిపై ఏపీ తలపెట్టిన పోలవరం-నల్లమలసాగర్ లింక్ ప్రాజెక్టును అడ్డుకునేందుకు తెలంగాణ ప్రభుత్వం సీనియర్ న్యాయ నిపుణులతో చర్చలు జరిపింది. ఆదివారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి హైదరాబాద్ నుంచి ముంబయి వెళ్లారు. సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది అభిషేక్ సింఘ్వీతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు.

హైదరాబాద్, జనవరి 4: పీఎన్ఎల్‌పీపై గత నెలలో రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే. ప్రభుత్వం దాఖలు చేసిన రిట్ పిటిషన్ సోమవారం విచారణకు రానుంది. ప్రభుత్వం తరఫున సమర్థ వాదనలు

-మిగతా 2 లో..



# ఒలింపిక్స్-2036 నిర్వహణకు భారత్ సన్నద్ధం

**ప్రధాని మోదీ**

ఒలింపిక్స్-2036 క్రీడలను నిర్వహించేందుకు భారత్ పూర్తి స్థాయిలో సన్నద్ధమవుతోందని ప్రధాన మంత్రి నరేంద్రమోదీ అన్నారు. గత పదేళ్లలో అంతర్జాతీయ క్రీడలకు భారత్ వేదికగా నిలిచిందన్నారు. వారణా సిలో 72వ జాతీయ వాలీబాల్ ఛాంపియన్‌షిప్ పోటీల ప్రారంభోత్సవంలో ప్రధాని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. గత దశాబ్ద కాలంలో భారత్‌లో 20కిపైగా అంతర్జాతీయ క్రీడా పోటీలు నిర్వహించామని గుర్తుచేశారు.

# మహాజాతరను విజయవంతం చేస్తాం

**చరిత్రలో నిలిచిపోయేలా మేడారం పనులు.. మంత్రులు పొంగులేటి, సీతక్క**

ములుగు, జనవరి 4: వనదేవతలు సమ్మక్క, సారలమ్మ మహాజాతర పనులన్నింటినీ ఈ నెల 20 లోపు పూర్తి చేయిస్తామని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, పౌర సంబంధాలశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. జాతర ఏర్పాట్ల పరిశీలనార్థం ఆయన ఆదివారం ములుగు జిల్లాలోని మేడారం వచ్చారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ శిశుసంక్షమ శాఖ మంత్రి సీతక్క, మహబూబాబాద్ ఎంపీ బలరాంనాయక్, కలెక్టర్ టీఎస్ దివాకర, డీఎఫ్‌వో రాహుల్‌కిషన్ జాదవ్‌తో కలిసి గద్దెల ప్రాంగణం


-మిగతా 2 లో..





## నైజర్‌లో దుండగుల దాడి..

**30 మందికి పైగా మృతి**



## తర్వాత వంతు మీదే..

**ప్రత్యర్థి దేశాలకు ట్రంప్ వార్నింగ్**

# నదీ జలాలపై అవగాహన లేని సీఎం

**420 హామీలిచ్చారు.. ఒక్కటి నెరవేర్చలేదు**

**కేసీఆర్‌ను తిట్టడం ద్వారా ఆయన స్థాయిని తగ్గించలేరు**

**బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శ**

హైదరాబాద్, జనవరి 4: నదీ జలాలపై ఏ మాత్రం అవగాహన లేని వ్యక్తి ఈ రాష్ట్రానికి ముఖ్యమంత్రి కావడం మన దురదృష్టకరమని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ విమర్శించారు. తెలంగాణకు చేస్తున్న ద్రోహాలకు ముందుగా కాంగ్రెస్ నాయకులను శిక్షించాలని ఆయన ధ్వజమెత్తారు. ఆదివారం తెలంగాణ భవన్‌లో నిర్వహించిన 'నదీ జలాలు – కాంగ్రెస్ ద్రోహాలు' పీపీటీ కార్యక్రమం సందర్భంగా కేటీఆర్ మాట్లాడారు. "అసెంబ్లీ ఎన్నికలకు ముందు రాహుల్‌గాంధీ, రేవంత్‌రెడ్డి మొదలుకొని కాంగ్రెస్ నాయకులందరూ ఆరు గ్యారంటీలు, 420 హామీలిచ్చారు. ఇప్పటి వరకూ ఒక్క హామీ కూడా నెరవేర్చలేదు. ముఖ్యమంత్రికి తిట్టడం తప్ప మరోటి సాధ్యం కాదు. కేసీఆర్‌ను తిట్టడం

-మిగతా 2 లో..





## నేటి చికెన్ ధరలు

| | |
|---|---|
| ఫారం ధర లైవ్ బర్డ్ | 150 (కిలో) |
| రిటైల్ లైవ్ బర్డ్ | 177 (కిలో) |
| డ్రెస్డ్ స్కిన్‌తో | 257 (కిలో) |
| స్కిన్ లెస్ | 292 (కిలో) |

12 గుడ్ల రిటైల్ ధర ₹88

# ఒక్క మాట అన్నందుకే.. సభను బాయ్‌కాట్ చేస్తారా?



**హరీశ్‌పై కవిత ఫైర్**

సూర్యాపేట, జనవరి 4: అసెంబ్లీలో ప్రతిపక్షం లేకుండా కృష్ణానీటిపై ప్రభుత్వం అబద్ధాలు చెప్పిందని ఎమ్మెల్సీ కవిత విమర్శించారు. సూర్యాపేటలో ఆమె విలేకర్లతో మాట్లాడుతూ తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావుపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. "వ్యక్తిగతంగా హరీశ్ రావును ఒక్క మాట అన్నందుకు అసెంబ్లీని బాయ్‌కాట్ చేస్తారా? ఆ

-మిగతా 2 లో..

# ప్రత్యేక వర్గాలకు 35 వేల ఇందిరమ్మ ఇళ్లు

**అదనంగా మంజూరు చేసిన ప్రభుత్వం**

**ఆదివాసీలకు ఇందిరమ్మ ఇళ్లపై ప్రత్యేక జీవో**

హైదరాబాద్, జనవరి 4: ఇందిరమ్మ పథకంలో భాగంగా ప్రత్యేక వర్గాలకు రాష్ట్ర ప్రభుత్వం ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 35,921 ఇళ్లను అదనంగా మంజూరు చేసింది. ఇందిరమ్మ ఇళ్ల కోసం పారిశుద్ధ్య కార్మికులు, ట్రాన్స్‌జెండర్లు, అనాథలు, దివ్యాంగులు, వితంతువులు, వ్యవసాయ కార్మికులు, ఆదివాసీల నుంచి దరఖాస్తులు వచ్చాయి. ఏటా నియోజకవర్గానికి 3,500 ఇళ్ల చొప్పున రాష్ట్రవ్యాప్తంగా గరిష్ఠంగా మొత్తం 4.50 లక్షల ఇళ్లు నిర్మించాలన్నది ప్రభుత్వ

-మిగతా 2 లో..



# తెలంగాణకు నంబర్-1 విలన్ కాంగ్రెస్




(మొదటిపేజీ తరువాయి)

లక్షల ఎకరాల ఆయకట్టు ఉంది" అని హరీశ్ రావు అన్నారు. హైదరాబాద్: పాలమూరు, డిండిలను కొనసాగిస్తామని కేసీఆర్ ఆనాడే చెప్పారు. టెలిమెట్రీలను పెట్టాలని 2016లోనే కోరారు. కేంద్రం స్పందించకపోతే.. ఏమాత్రం వెనక్కి తగ్గకుండా సుప్రీంకోర్టు గడపతొక్కారు. ట్రైబ్యునల్ అవార్డు వచ్చేవరకూ 50:50 నిష్పత్తిలో నీటి పంపిణీ జరగాలంటూ 2018 నుంచి 2023 వరకు కేఆర్ఎంబీకి అప్పటి భారాస ప్రభుత్వం 28 లేఖలు రాసింది. రెండో ఎపెక్స్ కౌన్సిల్ సమావేశంలోనూ అత్యంత శక్తిమంతమైన వాదన వినిపించింది" అని అసెంబ్లీలో భారాస డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు స్పష్టం చేశారు. తెలంగాణ భవన్‌లో ఆదివారం 'నదీ జలాలు- కాంగ్రెస్ ద్రోహాలు' అనే అంశంపై భారాస ఎమ్మెల్యేలు, ఎంపీలు, ముఖ్య నాయకులకు ఆయన 'పవర్ పాయింట్ ప్రజంటేషన్ (పీపీటీ)' ఇచ్చారు. 'నీళ్ల కోసం నా తెలంగాణ ఎదురుచూస్తోంది.. ఇంకెప్పుడు వేస్తారు ట్రైబ్యునల్' అని కేసీఆర్ ప్రశ్నించారని, సుప్రీంకోర్టులో పిటిషన్ ఉపసంహరించుకుంటే వెంటనే కొత్త ట్రైబ్యునల్ ఏర్పాటు చేస్తామని కేంద్ర ప్రభుత్వం హామీ ఇచ్చేలా ఒత్తిడి పెంచారని గుర్తుచేశారు. "సెక్షన్-3 కావాలంటూ కేసీఆర్ కేంద్రానికి 32 లేఖలు రాశారు. భారాస సుదీర్ఘ పోరాటం ఫలితంగానే... కృష్ణా జలాల పునఃపంపిణీకి సెక్షన్-3 సాధ్యమైంది. నీళ్ల విషయంలో చంద్రబాబు, జగన్‌లను కేసీఆర్ నిలదీశారు. పోతిరెడ్డిపాడును ఆపకపోతే.. అలంపూర్ దగ్గర ప్రాజెక్టు కడతామని హెచ్చరించారు. వీటన్నింటినీ దాచిపెట్టి.. సీఎం రేవంత్ తనకు నచ్చిన రీతిలో.. ఎపెక్స్ కౌన్సిల్ సమావేశం మినిట్స్‌లోని పేరాలను కిందివి పైకి.. పైవి కిందకు మార్చి.. శాసనసభ సాక్షిగా అబద్ధాలు చెప్పారు" అని ధ్వజమెత్తారు. ఈ సందర్భంగా పలు అంశాలపై మాట్లాడారు.

## తెలంగాణకు నంబర్ వన్ విలన్ కాంగ్రెస్సే

"తెలంగాణకు నంబర్ వన్ విలన్ కాంగ్రెస్సే. ఫజల్ అలీ కమిషన్ వద్దన్నా... ఆంధ్రాలో కలిపి తెలంగాణకు ద్రోహం చేసింది ఆ పార్టీయే. పాలమూరుకు మరణశాసనం రాసిందే ఆ పార్టీ నాయకులు. 11వ షెడ్యూల్‌లో పాలమూరు-రంగారెడ్డి పథకాన్ని పెట్టకుండా... విభజన సమయంలోనూ అన్యాయం చేశారు. కృష్ణా ప్రాజెక్టులను కేఆర్ఎంబీకి అప్పచెబుతామని రేవంత్ ప్రభుత్వం చెప్పింది. గోదావరి-బనకచర్ల ప్రాజెక్టుపై లోపాయికారీ ఒప్పందం చేసుకొని.. తెలంగాణ ప్రాజెక్టులను కుట్రపూరితంగా నిర్లక్ష్యం చేస్తున్నారు. కాళేశ్వరంపై కక్షగట్టారు. పాలమూరుపై పగబట్టారు. రూ.100-200 కోట్లు ఖర్చు పెడితే 5-6 లక్షల ఎకరాలకు నీళ్లు వచ్చే అవకాశం ఉన్నా... రెండేళ్లలో రూ.2 కూడా కాళేశ్వరంపై ఖర్చు పెట్టలేదు. జూరాల జలాశయం నీటి నిల్వ సామర్థ్యం 7 టీఎంసీలు. ఇంత తక్కువ సామర్థ్యం ఉన్న సోర్సు నుంచి భారీ ఎత్తిపోతల పథకాలను నడపటం అసాధ్యం. శ్రీశైలం సామర్థ్యం 308 టీఎంసీలు. ఇక్కడి నుంచి నీటిని తీసుకోవడం వల్ల వర్షాకాలంలో గరిష్ఠ స్థాయిలో ఎత్తిపోసుకునే ఉంటుంది. అందుకే పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల సోర్సును శ్రీశైలానికి మార్చాం.

## కృష్ణా జలాల్లో తెలంగాణ వాటాకు మరణశాసనం రాసింది కాంగ్రెస్సే

ఉమ్మడి ఏపీలో 42 లక్షల ఆయకట్టు ఉంది. 2004 నుంచి 2014 వరకు కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో 5.71 లక్షల ఎకరాల కొత్త ఆయకట్టు తెస్తే... 2014 నుంచి 2023 వరకు తొమ్మిదిన్నరేళ్ల భారాస పాలనలో మేం కొత్తగా 17 లక్షల ఎకరాల ఆయకట్టు తెచ్చాం. ఎస్సారెస్పీ స్టేజ్-2కు కాళేశ్వరం నీళ్లు అందించాం. పదేళ్లలో కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన స్థిరీకరణ 93 వేల ఎకరాలు. బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన స్థిరీకరణ 31.50 లక్షల ఎకరాలు. గోదావరిలో నిజాం కాలంలో మనకు దక్కింది 252 టీఎంసీలు. 60 ఏళ్ల కాంగ్రెస్, తెదేపాల పాలనలో.. గోదావరిపై ప్రాజెక్టులకు సాధించిన హక్కులు 265 టీఎంసీలు. కేసీఆర్ ప్రభుత్వం 383 టీఎంసీలకు హక్కులు సాధించింది. కృష్ణా జలాల్లో తెలంగాణకు 299 టీఎంసీల వాటా కేటాయింపులోనూ నాటి కాంగ్రెస్ ప్రభుత్వం చారిత్రక ద్రోహం చేసింది. ఆ నది జలాల పంపిణీలో తెలంగాణకు న్యాయమైన 69 శాతం వాటా కోసం ట్రైబ్యునల్ ఏర్పాటు చేయాలని కొట్లాడింది కేసీఆరే. సెక్షన్-3 కింద కృష్ణా జలాల పునఃపంపిణీ జరగనుంది. ఐదారు నెలల్లో 500-600 టీఎంసీలు తెలంగాణకు రాబోతున్నాయి. ఈ ఘనత కేసీఆర్‌దే. 2023లోనే 66:34 నిష్పత్తి లేకుండానే కేఆర్ఎంబీ వద్ద అగ్రిమెంట్ కుదుర్చుకున్నాం. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక మళ్లీ 66:34 నిష్పత్తికి అంగీకరించింది. కృష్ణా జలాల్లో తెలంగాణ వాటాకు మరణశాసనం రాసింది మీరు కాదా? ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణకు నికర జలాలు కేటాయించకపోవడం వల్లే అన్యాయం జరిగింది. భారాస ప్రభుత్వం వచ్చాక 11 ప్రాజెక్టులకు డీపీఆర్‌లు పంపాం. ఇందులో 7 ప్రాజెక్టులకు అనుమతులు సాధించాం. సమ్మక్కసాగర్ ప్రాజెక్టు డీపీఆర్ పెండింగ్‌లో ఉంది. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక పాలమూరు-రంగారెడ్డి, అంబేద్కర్ వార్ధా, కాళేశ్వరం అదనపు టీఎంసీ డీపీఆర్‌లు తిరిగొచ్చాయి. కాంగ్రెస్ ప్రభుత్వం రెండేళ్ల పాలనలో ఒక్క డీపీఆర్‌ను కూడా పంపించలేదు. కృష్ణాలో పెండింగ్ ప్రాజెక్టులను రన్నింగ్ ప్రాజెక్టులుగా చేసి.. ఆరున్నర లక్షల ఎకరాలకు నీళ్లు ఇచ్చిన ఘనత మాది. కల్వకుర్తి ప్రాజెక్టు కింద 3.5 లక్షల ఎకరాలకు నీళ్లిచ్చాం. భారాస హయాంలో ఎస్ఎల్‌బీసీలో పదకొండున్నర కి.మీ. టన్నెల్ తవ్వాం. దానికి రూ.1,358 కోట్లు ఖర్చు పెట్టాం. టన్నెల్ పూర్తయితే.. డిండి, పెండ్లిపాక రిజర్వాయర్‌లో నీళ్లు పడతాయి. కాంగ్రెస్ రెండేళ్లలో 18 మీటర్లు మాత్రమే తవ్వింది. తొమ్మిదిన్నరేళ్ల భారాస పాలనలో ఏటా 120 టీఎంసీలు మాత్రమే ఏపీకి తరలివెళ్తే.. కాంగ్రెస్ హయాంలో 2024-25లో ఏకంగా 241 టీఎంసీల కృష్ణా నీళ్లు తరలించారు.

## శాసన సభను సీఎం తప్పుదోవ పట్టించారు

రాయలసీమ ఎత్తిపోతల ప్రాజెక్టును తాను చెబితే చంద్రబాబు ఆపారని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిన్న అసెంబ్లీలో గొప్పలు చెప్పారు. ఆయన వ్యాఖ్యలను ఏపీ ప్రభుత్వం ఖండించింది. ఈ ప్రాజెక్టుపై 2020లోనే ఏపీ సీఎంగా జగన్ ఉన్నప్పుడే.. భారాస ప్రభుత్వం ఎన్జీటీకి వెళ్లి స్టే తెచ్చిందని స్పష్టం చేసింది. తెలంగాణ ప్రజలను, శాసనసభను తప్పుదోవ పట్టించిన ముఖ్యమంత్రి క్షమాపణ చెప్పాలి. తన పదవికి రాజీనామా చేయాలి. సభా వేదికగా అసత్యాలు చెప్పినందుకు ఇప్పుడు ఎవరి నాలుక కోయాలో సీఎం చెప్పాలి? రుణమాఫీపై దేవుళ్లపై ఒట్లు పెట్టి మాటతప్పిన ముఖ్యమంత్రి... మళ్లీ 'దేవుడిపై ఆన' అనడం విడ్డూరమే. నేను ఇలా మాట్లాడుతున్నందుకు నాపై దాడి జరిపించొచ్చు. అవసరమైతే హత్యాయత్నం కూడా చేయించవచ్చు. నేరం చేసేది కాంగ్రెస్.. నెపం నెట్టేది భారాస మీద. కృష్ణా నదీ జలాల విషయంలో కాంగ్రెస్ అన్యాయంపై ప్రశ్నిస్తాం. ప్రజాక్షేత్రంలో ఎండగడతాం. అవసరమైతే మరో జల పోరాటానికి భారాస శ్రీకారం చుడుతుంది. మాకు అధికారం ముఖ్యం కాదు. తెలం గాణ ప్రజల హక్కులు ముఖ్యం" అని హరీశ్‌రావు పేర్కొన్నారు.



# ప్రభుత్వం తరఫున సమర్థ వాదనలు వినిపించాలి

(మొదటిపేజీ తరువాయి)

వినిపించాలని సింఘ్వీకి సీఎం సూచించారు. అవసరమైన అన్ని ఆధారాలను సిద్ధంగా ఉంచుకోవాలంటూ నీటిపారుదల ఇంజినీర్లను ప్రభుత్వం అప్రమత్తం చేసింది. న్యాయనిపుణులతో భేటీలో పలు కీలక అంశాలపై చర్చించారు. పోలవరం ప్రాజెక్టు నుంచి బనకచర్ల హెడ్‌రెగ్యులేటర్ లేదా నల్లమలసాగర్ జలాశయానికి లింక్ చేసేలా గోదావరిపై ఏపీ ప్రాజెక్టు చేపడుతోందంటూ రిట్ పిటిషన్‌లో తెలంగాణ సుప్రీంకోర్టుకు విన్నవించింది. దీనికి ఎలాంటి అనుమతులు లేవని పేర్కొంది. ఈ పనులను తక్షణమే నిలిపివేసేలా పోలవరం ప్రాజెక్టు అథారిటీని ఆదేశించాలని అభ్యర్థించింది. అనుమతించిన మేరకే పోలవరం ప్రాజెక్టు స్వరూపం ఉండాలని, విస్తరణ పనులు చేపట్టడం చట్టవిరుద్ధం అని పేర్కొంది. 'దీనిపై తెలంగాణ.. కేంద్రానికి పలు అభ్యంతరాలను తెలిపింది. వీటిని పరిగణనలోకి తీసుకోకుండా నల్లమలసాగర్ ప్రాజెక్టు ప్రీ ఫీజిబిలిటీ రిపోర్టును (పీఎఫ్ఆర్) కేంద్ర ప్రభుత్వం పరిశీలించడం సమంజసం కాదని తెలిపింది. దీనికి సంబంధించి ఎటువంటి చర్యలు చేపట్టరాదంటూ జలశక్తి మంత్రిత్వ శాఖ, కేంద్ర జల సంఘం, గోదావరి నదీ యాజమాన్య బోర్డులకు స్పష్టమైన ఆదేశాలు ఇవ్వాలని కేంద్రాన్ని కోరింది" అని రిట్‌పిటిషన్‌లో పేర్కొంది. అభ్యంతరాలు చెబుతున్నా కేంద్ర జల సంఘం మార్గదర్శకాలకు విరుద్ధంగా పోలవరం-నల్లమలసాగర్ లింక్‌కు సంబంధించి ప్రాజెక్టు సమగ్ర నివేదిక (డీపీఆర్) తయారీకి ఏపీ ప్రభుత్వం సిద్ధపడుతోందని పిటిషన్‌లో తెలంగాణ తెలిపింది. డీపీఆర్‌పై ఆ రాష్ట్రం ముందుకు వెళ్లకుండా చూడాలని కోరింది. ఏపీ నిర్మిస్తున్న లింక్ ప్రాజెక్టులకు పర్యావరణ అనుమతులు జారీ చేయకుండా, కేంద్రం నుంచి ఎటువంటి ఆర్థిక సాయం అందించకుండా తగిన ఆదేశాలు ఇవ్వాలంటూ సుప్రీంకోర్టును కోరింది.

# నదీ జలాలపై అవగాహన లేని సీఎం

(మొదటిపేజీ తరువాయి)

ద్వారా ఆయన స్థాయిని తగ్గించలేరు. తెలంగాణ ముక్తి కోసం తన ప్రాణాలనే పణంగా పెట్టి పోరాడిన నాయకుడు కేసీఆర్. అలాంటి నేతపై అహంకారంతో, ద్వేషంతో మాట్లాడటం తెలంగాణ ప్రజల గుండెలను రగిలిస్తోంది. బచావత్ ట్రైబ్యునల్‌కు, బ్రిజేష్ ట్రైబ్యునల్‌కు మధ్య తేడా రేవంత్‌కు తెలియదు. కాంగ్రెస్ పాలనలో ఇప్పటికే వందల మంది రైతులు, ఆటోడ్రైవర్లు, గురుకుల విద్యార్థులు, నేతన్నలు ప్రాణాలు కోల్పోయారు. ఈ ప్రాణాలకు ఎవరు సమాధానం చెబుతారు? తెలంగాణ ప్రయోజనాల సాధన కోసం భారాస పోరాటం ఆగదు. కాంగ్రెస్ ప్రభుత్వ అసమర్థ, అహంకార, ద్రోహపూరిత విధానాలను నిరంతరం ఎండగడతాం" అని కేటీఆర్ పేర్కొన్నారు.



# ఒక్క మాట అన్నందుకే.. సభను బాయ్‌కాట్ చేస్తారా?

(మొదటిపేజీ తరువాయి)


అంశంపై వాకౌట్ చేస్తే తరువాత సభకు రావచ్చు కదా.. మిగతా బిల్లులపై చర్చ జరుగుతుంటే ప్రతిపక్షం ఉండొద్దా..? సభ నుంచి వాకౌట్ చేయాలనే నిర్ణయం హరీశ్ రావుదేనా? బీఆర్ఎస్ పార్టీలో హరీశ్ ఓ గుంపును తయారు చేస్తున్నారు. బాయ్‌కాట్ నిర్ణయం అధిష్ఠానానిదే అయితే.. అది మంచిది కాదు. బయట సభలు పెడుతూ.. చట్టసభల్లో మాట్లాడే అవకాశం వదులుకోవడం కరెక్ట్ కాదు. కృష్ణా పంపకాల్లో హక్కులు తగ్గించి హరీశ్ సంతకం ఎందుకు పెట్టారో చెప్పి పవర్-పాయింట్ ప్రజెంటేషన్ చేయాల్సింది. హరీశ్ ధనదాహం కోసమే జూరాల నుంచి శ్రీశైలానికి మార్పు చేశారు. హరీశ్ నిర్ణయాలతో సాగు నీటి ప్రాజెక్టులకు తీవ్రం నష్టం జరిగింది" అని కవిత విమర్శించారు. "కేసీఆర్ తప్పులు చేశారనే వాదన తప్ప కృష్ణానది నీటి వాటాపై చర్చ లేదు. ఆల్మట్టి ఎత్తు పెంచుకుంటే ఉత్తరం రాసి వదిలేశారు. కృష్ణాపై చిత్తశుద్ధి ఉంటే ఎందుకు సమగ్ర చర్చ జరపడం లేదు. తుంగభద్ర, కృష్ణా నీటిపై కర్ణాటకతో పేచీ ఉంటే.. రెండు కాంగ్రెస్ ప్రభుత్వాలు ఎందుకు పరిష్కరించడం లేదు? గత ప్రభుత్వంపై నిందలు వేస్తూ తప్పులను కప్పిపుచ్చుకోవడానికి సీఎం రేవంత్ ప్రయత్నిస్తున్నారు. చిత్తశుద్ధి ఉంటే కర్ణాటక అప్పర్ భద్ర ప్రాజెక్టు జాతీయ హోదాను తొలగించాలని, ఆల్మట్టి ఎత్తు తగ్గించాలని తీర్మానం చేయాలి" అని కవిత వ్యాఖ్యానించారు.

# డబ్బులు రిఫండ్ చేయండి.. పరిహారం చెల్లించండి

## గచ్చిబౌలి ఏఐజీ ఆసుపత్రిని ఆదేశించిన జిల్లా వినియోగదారుల కమిషన్

**హైదరాబాద్:** మందుల బిల్లులపై అధిక ఛార్జీలు వసూలు చేశారంటూ గచ్చిబౌలిలోని ఏఐజీ ఆసుపత్రిపై అందిన ఫిర్యాదుపై రంగారెడ్డి జిల్లా వినియోగదారుల కమిషన్ తీర్పు వెలువరించింది. ఫిర్యాదుదారుకు రూ.3,50,775.. 9 శాతం వడ్డీతో రిఫండ్ చేయడంతోపాటు రూ.30 వేల పరిహారం, కేసు ఖర్చుల కింద రూ.10,000 చెల్లించాలని ఆదేశించింది. వినియోగదారుల సంక్షమ నిధికి రూ.లక్ష చెల్లించాలని పేర్కొంది. ఏపీలోని మాచర్లకు చెందిన ఎం.శివనారాయణ ఫిర్యాదులో తెలిపిన వివరాల ప్రకారం.. కిడ్నీ సమస్యతో బాధపడుతున్న తన భార్యను చికిత్స నిమిత్తం 2022లో గచ్చిబౌలిలోని ఏఐజీ ఆసుపత్రిలో చేర్పించారు. ఆ సమయంలో మెరోప్లాన్ 1జీఎం ఇంజక్షన్ మొత్తం 79 డోసులు ఇచ్చారు. ప్రతి డోసుకు రూ.4,750.19 ఛార్జ్ చేశారు. బయట అదే ఇంజక్షన్ రూ.700కే కొనుగోలు చేశానంటూ.. ఫిర్యాదుదారు వినియోగదారుల కమిషన్‌ను ఆశ్రయించారు. ఫిర్యాదుదారు ఆరోపణలు అవాస్తవమని ఏఐజీ తరఫు అడ్వొకేట్ వాదనలు వినిపించారు. మెరోప్లాన్ 1జీఎం ఇంజక్షన్‌ను రూ.4,730-రూ.4,750కు ఆసుపత్రి కొనుగోలు చేసిందని.. అదే ధర రోగికి ఛార్జ్ చేసిందని తెలిపారు. వాదనలు విన్న వినియోగదారుల కమిషన్.. ఫిర్యాదుదారుకు పరిహారం చెల్లించాలని ఆదేశించింది.

# ఫోన్ అక్రమ ట్యాపింగ్ కేసులో ఎమ్మెల్సీ నవీన్‌రావు విచారణ



**హైదరాబాద్:** ఫోన్ అక్రమ ట్యాపింగ్ కేసు కీలక మలుపులు తిరుగుతోంది. భారాస ఎమ్మెల్సీ నవీన్‌రావును ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ఆదివారం సుదీర్ఘంగా విచారించడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఉదయం 11 గంటల సమయంలో సిట్ కార్యాలయానికి వచ్చిన ఆయన్ని రాత్రి 8 గంటల వరకు విచారించారు. సిట్ సభ్యులు నారాయణరెడ్డి, ఎం.రవీందర్‌రెడ్డితో కూడిన బృందం నవీన్‌రావు వాంగ్మూలాన్ని నమోదు చేసింది. ఆయన నుంచి సేకరించిన సమాచారం ఆధారంగా మరికొందరు కీలక ప్రజాప్రతినిధులను విచారించే అవకాశమున్నట్లు తెలుస్తోంది. విశ్వసనీయ సమాచారం మేరకు... భారాస పెద్దలతో ఉన్న ఆర్థిక సంబంధాల విషయంలో నవీన్‌రావును సిట్ విచారించింది. భారాస ప్రభుత్వంలో స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్రాంచ్(ఎస్ఐబీ)లో పనిచేసిన ప్రభాకర్ రావు బృందంతో సంబంధాలపై ఆరా తీసింది. ముఖ్యంగా భారాసకు ఎలక్టోరల్ బాండ్లు సమకూరిన విషయంలో నవీన్‌రావు పాత్ర ఏంటి, ఆ సొమ్ముతో ఫోన్ అక్రమ ట్యాపింగ్ అంశానికి సంబంధముందా అన్న కోణంలో విచారించినట్లు తెలిసింది. వాస్తవానికి హైదరాబాద్ పోలీస్ కమిషనర్‌గా కొత్తకోట శ్రీనివాసరెడ్డి ఉన్నప్పుడు ఫోన్ అక్రమ ట్యాపింగ్ కేసు దర్యాప్తు ముమ్మరంగా సాగుతున్న క్రమంలోనే నవీన్‌రావు పేరు తెరపైకి వచ్చింది. ఆయనకు నోటీస్ ఇచ్చి 2024 సెప్టెంబరు 24న వాంగ్మూలం నమోదు చేశారు. అయితే అప్పటి విచారణలో సరైన సమాచారం లభించలేదనే ఉద్దేశంతోనే మరోసారి ఆయన వాంగ్మూలాన్ని సిట్ నమోదు చేసినట్లు తెలిసింది. విచారణ ముగిసిన అనంతరం నవీన్‌రావు సిట్ కార్యాలయం వద్ద మీడియాతో మాట్లాడుతూ... "గతంలో విచారణకు హాజరయ్యాను. అప్పట్లో దాదాపు మూడు గంటలపాటు విచారించారు. ఇప్పుడూ అదే విషయంలో పిలిచారు. అప్పట్లో చెప్పిన విషయాలనే ఇప్పుడూ చెప్పాను. విచారణకు పూర్తిగా సహకరించాను. బయట ప్రచారం జరుగుతున్నట్లు ఫోన్ ట్యాపింగ్ పరికరాలను నేనే సమకూర్చాననే విషయంలో ఎలాంటి ప్రశ్నలు అడగలేదు. అలాంటి ప్రస్తావనే రాలేదు. విచారణకు మళ్లీ పిలిచినా వస్తా" అని పేర్కొన్నారు. ఎమ్మెల్సీ నవీన్‌రావు విచారణ నేపథ్యంలో జూబ్లీహిల్స్ సిట్ కార్యాలయం వద్దకు భారాస నేతలు, కార్యకర్తలు చేరుకున్నారు. కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు కూడా అక్కడికి వచ్చారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ... "ఏ ఆధారం లేకున్నా నవీన్‌రావును విచారణకు పిలిచారు. ఇది కేవలం రాజకీయ కుట్ర. కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు సహా భారాస ముఖ్యనేతలను కాంగ్రెస్ పార్టీ ఇబ్బందులకు గురిచేస్తోంది. కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధిపై దృష్టి పెట్టకుండా భారాస శ్రేణుల్ని ఇబ్బంది పెట్టడంలో నిమగ్నమైంది. ఇది కేవలం భారాసపై జరుగుతున్న దాడి" అని ఆరోపించారు.



# మహాజాతరను విజయవంతం చేస్తాం

(మొదటిపేజీ తరువాయి)

పునర్నిర్మాణం, జంపన్న వాగులో ఆధునికీకరణ పనులు, రక్షణ చర్యలను పరిశీలించిన అనంతరం మీడియాతో మాట్లాడారు. 200 ఏళ్ల వరకు చెక్కుచెదరకుండా ఉండేలా, చరిత్రలో నిలిచిపోయే విధంగా రాతి దిమ్మెలతో వనదేవతల గద్దెల ప్రాంగణం పునర్నిర్మాణం చేపడుతున్నామని చెప్పారు. ఈసారి తెలుగు రాష్ట్రాలతో పాటు దేశంలోని అన్ని ప్రాంతాల నుంచి గిరిజన, గిరిజనేతర భక్తులు పెద్ద ఎత్తున వచ్చే అవకాశముందన్నారు. ప్రజలందరి సహకారంతో మహాజాతరను విజయవంతం చేస్తామని ఆయన ధీమా వ్యక్తం చేశారు. పనులన్నీ పూర్తికాగానే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఒకరోజు మేడారంలో బస చేసి, ప్రారంభోత్సవాలు చేస్తారని చెప్పారు.

# మద్యం మత్తులో ఆటో డ్రైవర్ హంగామా

## పోలీసులపై పాము



**హైదరాబాద్:** డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడ్డ ఓ ఆటో డ్రైవర్ ట్రాఫిక్ పోలీసులపై పాము విసిరేందుకు ప్రయత్నించిన ఘటన పాతబస్తీ చంద్రాయణగుట్ట చౌరస్తా వద్ద కలకలం రేపింది. మద్యం సేవించి వాహనం నడుపుతున్నాడన్న అనుమానంతో ట్రాఫిక్ పోలీసులు ఆటోను ఆపి బ్రీత్ అనలైజర్ పరీక్ష నిర్వహించారు. పరీక్షలో డ్రైవర్‌కు 150 రీడింగ్ రావడంతో ఆటోను సీజ్ చేసేందుకు పోలీసులు సిద్ధమయ్యారు. ఈ సమయంలో మద్యం మత్తులో ఉన్న డ్రైవర్ ఒక్కసారిగా ఆటోలో నుంచి పామును తీసి పోలీసులపైకి విసిరే ప్రయత్నం చేశాడు. దీంతో పోలీసులు భయాందోళనకు గురై వెంటనే దూరం తప్పుకున్నారు. ఈ అవకాశాన్ని ఉపయోగించుకున్న ఆటో డ్రైవర్ పాముతో సహా అక్కడి నుంచి పరారయ్యాడు. ఘటనకు సంబంధించిన సీసీటీవీ ఫుటేజ్ ఆధారంగా నిందితుడిని గుర్తించేందుకు పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. పోలీసుల విధుల నిర్వహణకు ఆటంకం కలిగించడం, ప్రజల ప్రాణాలకు ముప్పుగా వ్యవహరించినందుకు కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు తెలిపారు.

# ప్రత్యేక వర్గాలకు 35 వేల ఇందిరమ్మ ఇళ్లు

(మొదటిపేజీ తరువాయి)

లక్ష్యం. ఇందులో భాగంగా ప్రత్యేక వర్గాలకు కూడా ఇళ్లు ఇవ్వాలని నిర్ణయించింది. ఏజెన్సీ ప్రాంతాల్లోని ఆదివాసీలకు ఇందిరమ్మ ఇళ్లపై ప్రత్యేక జీవో తీసుకొచ్చింది. వారికి ప్రభుత్వమే ఇళ్లు నిర్మించి ఇవ్వనుంది. ఇతర వర్గాలకు కూడా మహిళా సంఘాల ద్వారా రుణాలిప్పించి నిర్మాణ ప్రక్రియను ప్రారంభించింది. రాష్ట్రంలో ఇప్పటివరకు 3.69 లక్షల ఇళ్లను లబ్ధిదారులకు మంజూరు చేశారు. ఇందులో 2.45 లక్షలు గ్రౌండ్ అయ్యాయి. పునాదిదశలో 84 వేలు, గోడల దశలో 43 వేలు, శ్లాబ్ దశలో 52 వేలు ఉన్నాయి. మరో 1,311 ఇళ్ల నిర్మాణం చివరి దశకు చేరుకోగా.. మిగిలిన ఇళ్ల పనులు పూర్తి స్థాయిలో ప్రారంభం కావాల్సి ఉంది. ఇవే కాకుండా ప్రత్యేక వర్గాలకు కూడా ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసి క్షత్రస్థాయిలో నిర్మాణం చేసుకునేలా ప్రత్యేక ప్రణాళికను అమలు చేస్తోంది.



## నైజర్‌లో దుండగుల దాడి..

### 30 మందికి పైగా మృతి

**నైజర్ :** ఉత్తర నైజీరియా ప్రాంతంలోని నైజర్ రాష్ట్రంలో దుండగులు దారుణానికి పాల్పడ్డారు. శనివారం సాయంత్రం బోర్గు ప్రభుత్వ పరిధిలోని కసువాన్ – డాజీ గ్రామంలోకి ఆయుధాలతో చొరబడి.. విచక్షణారహితంగా కాల్పులు జరిపారు. ఈ ఘటనలో 30 మందికి పైగా ప్రజలు ప్రాణాలు కోల్పోయారు. మరికొందరిని దుండగులు అపహరించుకెళ్లారు. సమాచారం అందుకున్న పోలీసులు గ్రామానికి చేరుకొని దర్యాప్తు చేపట్టారు. దుండగుల కాల్పుల్లో 37 మంది మృతి చెందినట్లు ప్రాథమిక అంచనా ఉందన్నారు. మృతులు సంఖ్య మరింత పెరిగే అవకాశముందని వెల్లడించారు. దుండగులు గ్రామంలోని స్థానిక మార్కెట్‌తోపాటు పలు ఇళ్లను తగలబెట్టినట్లు పోలీసులు తెలిపారు. అపహరణకు గురైన వారి ఆచూకీ కోసం బలగాలను రంగంలోకి దింపినట్లు చెప్పారు. ఈ ఘటనతో అక్కడి ప్రజలు భయాందోళనకు గురయ్యారు.



## గ్రోక్‌తో చట్టవిరుద్ధ కంటెంట్ సృష్టిస్తే కఠిన చర్యలు

### ఎలాన్ మస్క్ హెచ్చరిక

**న్యూఢిల్లీ :** కొన్ని రోజులుగా ప్రముఖ సామాజిక మాధ్యమ వేదిక 'ఎక్స్'లోని ఏఐ ప్లాట్‌ఫామ్ గ్రోక్‌ను వాడి కొందరు అసభ్య, అశ్లీల, చట్టవిరుద్ధ కంటెంట్‌ను సృష్టిస్తున్నారు. దీనిపై దేశ వ్యాప్తంగా ఆందోళనలు కొనసాగుతున్నాయి. ఈ నేప థ్యంలో 'ఎక్స్' యజమాని ఎలాన్ మస్క్ స్పందించారు. గ్రోక్ ద్వారా చట్టవిరుద్ధ కం టెంట్ సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరిం చారు. అలాంటి కంటెంట్‌ను 'ఎక్స్'లో అప్‌లోడ్ చేసేవారు ఎలాం టి పరిణామాలు ఎదుర్కొంటారో.. గ్రోక్‌ను దుర్వినియోగం చేసేవారికీ అలాంటి పరిమాణాలే ఉంటాయన్నారు. గ్రోక్‌తో తయారు చేస్తున్న చట్టవిరుద్ధ కంటెంట్‌ను తక్షణమే తొలగించాలని భారత ఎలక్ట్రానిక్ అండ్ ఐటీ మంత్రిత్వశాఖ ఎక్స్‌కు ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే. 72 గంటల్లోగా తీసుకున్న చర్యలపై సమగ్ర నివేదిక ఇవ్వాలని ఎక్స్‌ను ఆదేశించింది. తమ ఆదేశాలను పాటించకపోతే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించిన మరుసటి రోజే మస్క్ ఈ ప్రకటన చేయడం గమనార్హం. గ్రోక్ వివాదం కొనసాగుతున్న వేళ ఎక్స్‌లో ఓ పోస్టుకు మస్క్ స్పందిస్తూ తమ తప్పేం లేదని చెప్పే ప్రయత్నం చేశారు. "చాలా మంది గ్రోక్ అసభ్యకర కంటెంట్‌ను సృష్టిస్తోందని చెబుతున్నారు. నిజానికి పెన్ ఏదైనా తప్పుగా రాస్తే అది పెన్ బాధ్యత కాదు.. రాసిన వ్యక్తిది. గ్రోక్ కూడా అలాంటిదే. మీరు ఇచ్చే ఇన్‌పుట్‌ను బట్టే అవుట్‌పుట్ ఆధారపడి ఉంటుంది"అని పేర్కొన్నారు.



## ఆ కంటెంట్ అప్‌లోడ్ చేసిన అకౌంట్లను సస్పెండ్ చేస్తాం : ఎక్స్

**న్యూఢిల్లీ :** ఎలాన్ మస్క్‌కు చెందిన ప్రముఖ సామాజిక మాధ్యమ వేదిక 'ఎక్స్' కీలక ప్రకటన చేసింది. తమ వేదికపై పోస్టు చేసిన చట్టవిరుద్ధమైన కంటెంట్‌ను పూర్తిగా తొలగించడంతోపాటు.. వాటిని అప్‌లోడ్ చేసిన ఖాతాలను శాశ్వతంగా సస్పెండ్ చేస్తామని వెల్లడించింది. అవసరమైతే స్థానిక ప్రభుత్వాలతో కలిసి పనిచేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపింది. ఈ మేరకు 'ఎక్స్ గ్లోబల్ గవర్నమెంట్ అఫైర్స్' ఖాతా ద్వారా ఈ ప్రకటన విడుదల చేసింది. అంతకుముందు తమ ఏఐ సేవలు గ్రోక్‌ను ఉపయోగించి అశ్లీల కంటెంట్ సృష్టించినవారిపై, నేరుగా అలాంటి వాటిని అప్‌లోడ్ చేసిన వారిపై ఒకే రకరమైన చర్యలు తీసుకుంటామని ఎలాన్ మస్క్ హెచ్చరించిన విషయం తెలిసిందే. అనంతరం గ్లోబల్ గవర్నమెంట్ అఫైర్స్ కూడా స్పందిస్తూ చట్టవిరుద్ధ కంటెంట్ ఉన్న ఖాతాలను సస్పెండ్ చేస్తామని హెచ్చరించింది. ఎక్స్ నియమాలకు సంబంధించిన లింక్‌ను కూడా షేర్ చేసింది. ఎక్స్ వేదికపై స్థానిక చట్టాలకు విరుద్ధంగా అశ్లీల, అనుచిత కంటెంట్ పెరుగుతున్నట్లు భారత ప్రభుత్వం గుర్తించింది. ముఖ్యంగా గ్రోక్ ఏఐతో మహిళలపై అసభ్యకర చిత్రాలు సృష్టించి పోస్టులు చేసిన ఘటనలపై ఆందోళన వ్యక్తం చేసింది. ఈ నేపథ్యంలోనే జనవరి 2న ఎక్స్‌కు నోటీసులు జారీ చేసింది. గ్రోక్‌తో రూపొందించిన అసభ్య కంటెంట్‌ను తొలగించాలని, దీనిపై సమగ్ర నివేదిక ఇవ్వాలని దీనిలో పేర్కొంది. ఈ నేపథ్యంలోనే ఎక్స్ చర్యలు చేపట్టింది.

# కరెంటు లేదు.. ఆహారం, ఫోన్ల ఛార్జింగ్ కోసం బారులు

### వెనెజువెలాలో పరిస్థితి ఇదీ



**వెనెజువెలా :** ఎలాంటి ముందస్తు హెచ్చరికలు లేకుండా.. వెనెజువెలాపై అమెరికా ఒక్కసారిగా మెరుపుదాడులకు పాల్పడింది. ఈ దాడులతో ఆ దేశ ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు. వైమానిక దాడుల్లో కీలకమైన మౌలిక సదుపాయాలు, విద్యుత్ గ్రిడ్‌లు దెబ్బతినడంతో కారకాస్‌లోని అనేక ప్రాంతాల్లో కరెంట్ లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సూపర్ మార్కెట్లు మూతపడటంతో.. చిన్న దుకాణాల వద్ద ప్రజలు ఆహారం కోసం గంటల తరబడి వేచి చూడాల్సిన పరిస్థితి తలెత్తింది. కారకాస్‌లోని భారతీయుడు సునీల్ మల్హోత్రా మీడియాతో మాట్లాడుతూ అక్కడి పరిస్థితు లను వివరించారు. 'భారీ నష్టం జరిగింది. కారకాస్‌లోని విమానాశ్రయంపై కూడా అమెరికా దాడి చేసింది. నగరానికి 100 కి.మీల దూరంలో ఓ వైమానిక స్థావరం ఉంది. దేశంలోనే అతిపెద్దది. అది కూడా దెబ్బతింది. ఫోర్ట్‌ట్యూనా మిలిటరీ స్థావరం వద్ద ఎక్కువ నష్టం జరిగింది. దాడి అనం తరం అన్ని సూపర్ మార్కెట్లు మూసేశారు. చిన్న దుకాణాలు మాత్రమే తెరిచి ఉన్నాయి. వాటి ముందు పొడవైన క్యూలు కన్పిస్తున్నాయి. ప్రతి చోటా 500– 600 మంది బారులు తీరారు. ఫార్మసీల వద్ద చాలా పెద్ద క్యూలు కన్పిస్తున్నాయి' అని పేర్కొన్నారు. ప్రజా రవాణా సేవలు కూడా నిలిచిపో యాయని ఆయన పేర్కొన్నారు. భయంతో కొన్ని ప్రాంతాల్లో ప్రజలు ఇళ్ల నుంచి బయటకు కూడా రావడం లేదన్నారు. కరెంటు లేకపోవడంతో ఫోన్ల ఛార్జింగ్‌కు కూడా ప్రజలు ఇబ్బందులు పడుతున్నట్లు పేర్కొన్నారు. రోడ్లపై ఉన్న కొన్ని విద్యుత్ దీపాల వద్ద కరెంటు ఉండటంతో.. దాని నుంచి ప్రజలు ఫోన్‌లకు ఛార్జింగ్ పెట్టుకుంటున్నారని వెల్లడించారు. తన ఫోన్‌ను ఛార్జ చేసుకోవడం కోసం చాలా దూరం నడిచి వెళ్లాల్సిన పరిస్థితి వచ్చిందని మల్హోత్రా తెలిపారు. కరెంటు సమస్య ఎప్పుడు తీరుతుందనే దానిపై స్థానిక యంత్రాంగం నుంచి స్పష్టమైన ప్రకటన ఏదీ రాలేదన్నారు. ఇక, కారకాస్‌లో భారతీయుల సంఖ్య చాలా తక్కువగా ఉన్నట్లు తెలుస్తోంది. తాజా పరిస్థితుల నేపథ్యంలో ఆ దేశంలో నివసిస్తున్న భారతీయుల కోసం అక్కడి భారత రాయబార కార్యాలయం ఓ వాట్సప్ గ్రూప్‌ను ఏర్పాటు చేసింది. దాని నుంచి ముఖ్యమైన సూచనలు చేస్తోంది.

## వెనెజువెలా తాత్కాలిక అధ్యక్షురాలిగా డెల్సీ రోడ్రిగ్స్



**వెనెజువెలా :** వెనెజువెలా తాత్కాలిక అధ్యక్షురాలిగా ప్రస్తుత ఉపాధ్యక్షురాలు డెల్సీ రోడ్రిగ్స్‌ను నియమిస్తున్నట్లు ఆ దేశ సుప్రీం కోర్టు ప్రకటించింది. వెనెజువెలా రాజధాని కారకాస్‌పై మెరుపుదాడి చేసి.. ఆ దేశాధ్యక్షుడు నికొలస్ మదురో, ఆయన భార్యను అమెరికా సైన్యం బంధించి తీసుకెళ్లిన సంగతి తెలిసిందే. దీంతో ప్రభుత్వ పరిపాలనా కొనసాగింపు, దేశ రక్షణను దృష్టిలో పెట్టుకొని ఈ నిర్ణయం తీసుకున్నట్లు సుప్రీం కోర్టు వెల్లడించింది.

### ఎవరీ డెల్సీ రోడ్రిగ్స్..?

లిగా సోషలిస్ట్ పార్టీ వ్యవస్థాపకుడు, వామపక్ష గెరిల్లా నాయకుడు జార్జ్ ఆంటోనియో కుమార్తె అయిన డెల్సీ రోడ్రిగ్స్ 1969లో వెనెజువెలా రాజధాని కారకాస్‌లో జన్మించారు. మదురో ప్రభుత్వంలో ఆమె కమ్యూనికేషన్, విదేశాంగ మంత్రిగా విధులు నిర్వర్తించారు. 2018లో ఉపాధ్యక్షురాలిగా నియమితులయ్యారు. ఉపాధ్యక్షురాలి స్థానంతో పాటు ఆర్థిక, చమురు మంత్రిత్వ శాఖల మంత్రిగా కొనసాగారు. వెనెజువెలాలోని చమురు కోసం ట్రంప్ సుంకాలు విధించిన వేళ..దేశాన్ని ద్రవ్యోల్బణం నుంచి బయటపడేయడంలో ఆమె కీలకపాత్ర పోషించారు. మదురోకు విశ్వసనీయురాలిగా పేరు తెచ్చుకున్నారు.

### ట్రంప్ మద్దతు..!

వెనెజువెలా తాత్కాలిక అధ్యక్షురాలిగా ఎన్నికైన 56 ఏళ్ల డెల్సీ రోడ్రిగ్స్‌కు అమెరికా అధ్యక్షుడు సైతం మద్దతిస్తున్నట్లు తెలుస్తోంది. ఇటీవల నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడిన ట్రంప్ వెనెజువెలాను మళ్లీ గొప్పగా మార్చడానికి ఏమి అవసరమని తాము భావిస్తున్నామో.. ఆ పనులను చేయడానికి డెల్సీ రోడ్రిగ్స్ సానుకూలంగా ఉన్నట్లు పేర్కొన్నారు. సరైన పరివర్తన సాధించే వరకు వెనెజువెలా అమెరికా పిడికిటే ఉంటుందని స్పష్టం చేశారు.

# ఢిల్లీ పేలుడు కేసు..

### 'ఘోస్ట్ సిమ్'తో ఉగ్ర కార్యకలాపాలు



**న్యూఢిల్లీ :** దిల్లీ పేలుడు కేసులో 'జాతీయ దర్యాప్తు సంస్థ' విచారణ ముమ్మరంగా కొనసాగుతోంది. ఈ ఉగ్రకుట్రలో కీలక నిందితులు అయిన వైద్యులు పాకిస్థానీ హ్యాండ్లర్లతో నిరంతరం సంప్రదింపులు జరపడానికి 'ఘోస్ట్ సిమ్' కార్డులు, ఎన్‌క్రిప్టెడ్ మెసేజ్ యాప్‌లను ఉపయోగించినట్లు అధికారులు తాజాగా వెల్లడించారు. సూసైడ్ బాంబర్ ఉమర్ నబీతో పాటు ఇతర నిందితులు రెండు మూడు ఫోన్లను వినియోగించినట్లు తెలిపారు. వారి పేర్లతో రిజిస్టర్ అయిన సిమ్‌లతో పాటు.. నకిలీ ఆధార్ కార్డులను ఉపయోగించి తీసుకున్న వాటిని కూడా ఉపయోగించేవారని అన్నారు. పాకిస్థాన్‌కు చెందినవారితో మాట్లాడడానికి వీటిని వినియోగించేవారని తెలిపారు. ఫోన్‌లో సిమ్ లేకపోయినా మెసేజ్‌లు పంపేందుకు ఎన్‌క్రిప్టెడ్ యాప్‌లను కూడా ఉపయోగించేవారని చెప్పారు. వీటిద్వారానే హ్యాండ్లర్ల నుంచి ఐఈడీల తయారీ నేర్చుకునేవారన్నారు. అక్రమ కార్యకలాపాల కోసం ఇతరుల వివరాలను ఉపయోగించి, మోసపూరితంగా తీసుకునే సిమ్‌లను ఘోస్ట్ సిమ్‌లు అంటారు. ఇటువంటి నకిలీ సిమ్‌కార్డులను సైబర్ నేరగాళ్లు, ఉగ్ర హ్యాండ్లర్లు ఉపయోగిస్తుంటారు. ఫోన్‌లలో సిమ్ లేకుండా ఉపయోగించే ఎన్‌క్రిప్టెడ్ యాప్‌లను కూడా ఉగ్రవాదులు వినియోగిస్తుంటారు. కాగా ఇటువంటి ఉగ్రవాద, సైబర్ నెట్‌వర్క్‌లను నిరోధించడానికి గతేడాది నవంబర్‌లో కేంద్ర ప్రభుత్వం కీలక చర్యలు తీసుకుంది. డివైజ్‌లో సిమ్ కార్డు ఉంటేనే యాప్ సర్వీసులు పనిచేసేలా చూడాలని డిపార్ట్‌మెంట్ ఆఫ్ టెలికమ్యూనికేషన్స్ (డాట్) సూచించింది. ఈ నిబంధనల ప్రకారం.. యూజర్ ఏ సిమ్‌తో అకౌంట్ రిజిస్టర్ చేశారో.. అది ఫోన్‌లో ఉంటేనే యాప్ పని చేస్తుంది. సిమ్ తీసేస్తే లేదా ఫోన్ మార్చితే యాప్ ఆటోమాటిక్‌గా లాగౌట్ అవుతుంది.

## నకిలీ యూపీఎస్సీ ఫలితాలతో ఐఏఎస్ సెంటర్‌కు..

### మోసపోయిన అభ్యర్థి

**ముస్సోరి:** నకిలీ యూపీఎస్సీ ఫలితాలతో ముస్సోరిలోని లాల్‌బహదూర్ శాస్త్రి నేషనల్ అకాడమీ ఆఫ్ అడ్మినిస్ట్రేషన్(ఎల్‌బీఎస్ఎన్ఏఏ)కు ఓ వ్యక్తి రావడం కలకలం రేపింది. ఈ ఘటనపై అధికారులు దర్యాప్తు ప్రారంభించారు. వివరాల్లోకి వెళ్తే.. బిహార్‌లోని సరన్ జిల్లాకు చెందిన పుష్పేశ్ సింగ్ గురుగ్రామ్‌లోని ఓ ప్రైవేటు సంస్థలో పనిచేస్తున్నాడు. అక్కడే పరిచయమైన కొందరు వ్యక్తులు యూపీఎస్సీ పరీక్ష, ఇంటర్వ్యూ నిర్వహించి ఉద్యోగం ఇప్పిస్తామని నమ్మించారు. రెండు విడతలుగా దాదాపు రూ. 28వేలు వసూలు చేశారు. అనంతరం అతడికి వాట్సప్ ద్వారా యూపీఎస్సీకి ఎంపికైనట్లు నకిలీ ఫలితాలను పంపించారు. శిక్షణ కోసం ఎల్‌బీఎస్ఎన్ఏఏకు రావాలని సూచించారు. అదంతా నమ్మిన పుష్పేశ్ సింగ్ శిక్షణ కోసం తన తల్లిదండ్రులతో కలిసి శనివారం ట్రైనింగ్ సెంటర్‌కు వెళ్లాడు. అతడి ఫలితాలను పరిశీలించిన అధికారులు.. అవి నకిలీవని గుర్తించి పోలీసులు, అధికారులకు సమాచారం ఇచ్చారు. అధికారులు వెంటనే అకాడమీకి చేరుకున్నారు. లోకల్ ఇంటెలిజెన్స్ యూనిట్, ఇంటెలిజెన్స్ బ్యూరో బృందాలను రంగంలోకి దింపారు. ప్రాథమిక విచారణ అనంతరం తాను మోసపోయినట్లు పుష్పేశ్ గ్రహించాడు. అతని ఫిర్యాదు మేరకు అధికారులు దర్యాప్తు ప్రారంభించారు. జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసి, కేసును గురుగ్రామ్‌కు బదిలీ చేశారు.

## ప్రియాంక గాంధీకి కీలక బాధ్యతలు

### అస్సాం స్క్రీనింగ్ కమిటీ ఛైర్మన్‌గా నియామకం



**న్యూఢిల్లీ :** కాంగ్రెస్ అగ్రనాయకురాలు, ఎంపీ ప్రియాంక గాంధీకి ఆ పార్టీ కీలక బాధ్యతలు అప్పగిం చింది. ఈ ఏడాది అస్సాంలో ఎన్నికలు జరగనున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో అక్కడ స్క్రీనింగ్ కమిటీ ఛైర్మన్‌గా ఆమెను నియమించింది. ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. ప్రియాంక కమిటీలో లోకసభ ఎంపీలు ఇమ్రాన్ మసూద్, సప్తగిరి శంకర్ ఉలకతో పాటు సిరివెల్ల ప్రసాద్‌ను సభ్యులుగా నియమించారు. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల ఖరారు, ఎన్నికల ముందు జరగాల్సిన అంతర్గత సంప్రదింపులు వంటివి ఈ కమిటీ నిర్వహించనుంది. ఇక, పశ్చిమ బెంగాల్, కేరళ. తమిళనాడు పుద్దుచ్చేరిలకు కూడా స్క్రీనింగ్ కమిటీలను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.



## ఒలింపిక్స్-2036 నిర్వహణకు భారత్ సన్నద్ధమవుతోంది

### : ప్రధాని మోదీ

**వారణాసి:** ఒలింపిక్స్–2036 క్రీడలను నిర్వహించేందుకు భారత్ పూర్తిస్థాయిలో సన్నద్ధమవుతోందని ప్రధాన మంత్రి నరేంద్రమోదీ అన్నారు. గత పదేళ్లలో అంతర్జాతీయ క్రీడలకు భారత్ వేదికగా నిలిచిందన్నారు. వారణాసిలో 72వ జాతీయ వాలీబాల్ ఛాంపియన్‌షిప్ పోటీల ప్రారంభోత్సవంలో ప్రధాని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. గత దశాబ్ద కాలంలో భారత్‌లో 20కిపైగా అంతర్జాతీయ క్రీడా పోటీలు నిర్వహించామని గుర్తుచేశారు. అండర్ – 17 ఫిఫా వరల్డ్‌కప్, హాకీ వరల్డ్ కప్, చెస్ టోర్నమెంట్ వంటి అంతర్జాతీయ ఈవెంట్లకు భారత్ విజయవంతంగా ఆతిథ్యం ఇచ్చిందన్నారు. 2030లో జరిగే కామన్వెల్త్ గేమ్స్ కూడా భారత్‌లోనే జరగనున్నాయని తెలిపారు. 2036లో ఒలింపిక్ క్రీడల కోసం భారత్ పూర్తిస్థాయిలో సన్నద్ధమవుతోందని చెప్పారు. భారత్ అభివృద్ధి వృత్తాంతాన్ని ప్రధాని మోదీ వాలీబాల్ ఆటతో పోల్చారు. ఏ విజయమైనా ఒక్కరి వల్ల సాధ్యం కాదనే విషయాన్ని ఈ క్రీడ తెలియజేస్తుందని, మన సమన్వయం, విశ్వాసం, జట్ల సంసిద్ధతపైనే మన విజయం ఆధారపడి ఉంటుందన్నారు. ఇందులో ప్రతి ఒక్కరి పాత్ర, బాధ్యత ఉంటుందని, వాటిని నెరవేర్చినప్పుడే మనం విజయం సాధిస్తామన్నారు. జనవరి 4 నుంచి 11 వరకు జరగనున్న ఈ జాతీయ వాలీబాల్ ఛాంపియన్‌షిప్‌లో దేశవ్యాప్తంగా 58 జట్లకు చెందిన వెయ్యికిపైగా క్రీడాకారులు పాల్గొంటున్నారు. ఈ పోటీలతో వారణాసి నగరం జాతీయ స్థాయి క్రీడా, సాంస్కృతిక కార్యక్రమాలకు వేదికగా మారుతుందని వాలీబాల్ ఛాంపియన్‌షిప్ నిర్వాహకులు ఆశాభావం వ్యక్తం చేశారు.



## తర్వాత వంతు మీదే..

### ప్రత్యర్థి దేశాలకు ట్రంప్ వార్నింగ్

**యూఎస్ :** వెనెజువెలా అధ్యక్షుడు నికొలస్ మదురోను అమెరికా సైన్యం బంధించిన అనంతరం ఆ దేశాధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ లాటిన్ అమెరికాలోని ప్రత్యర్థి దేశాలను హెచ్చరించారు. మెక్సికో, క్యూబా, కొలంబియా సైతం మాదకద్రవ్యాలను తయారు చేస్తూ.. అక్రమంగా అమెరికాలోకి సరఫరా చేస్తున్నాయని ఆరోపించారు. అనేక ముఠాలకు కూడా ఈ దేశాలు ఆశ్రయమిస్తున్నాయన్నారు. ఇప్పటికైనా పద్ధతి మార్చుకోకపోతే తర్వాత వెనెజువెలా పరిస్థితే ఎదుర్కోవాల్సి వస్తుందని బెదిరించారు. మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా తీసుకుంటున్న చర్యల్లో భాగంగా ఆయా దేశాలలోని డ్రగ్స్ ఉత్పత్తి చేసే ప్రయోగశాలపై దాడులు చేయడానికి కూడా వెనుకాడనని ట్రంప్ పేర్కొన్నారు. మరోవైపు అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ మాట్లాడుతూ.. ఇతర దేశాల నుంచి అమెరికాకు సరఫరా అవుతున్న డ్రగ్స్‌ను కట్టడి చేయడమే తమ అంతిమ లక్ష్యమని పేర్కొన్నారు. ఈ విషయంలో వెనెజువెలా తర్వాత క్యూబా, కొలంబియా వంటి దేశాలపైనా దృష్టి పెట్టే అవకాశం ఉందన్నారు. అమెరికా వెనెజువెలా అధ్యక్షుడిని బంధించడాన్ని క్యూబా, కొలంబియా, మెక్సికో ఖండించాయి. ఆ దేశంపై యూఎస్ నిర్వహించిన దాడులు దురాక్రమణ కిందకే వస్తాయన్నాయి. ట్రంప్ చర్యలతో తాము కూడా అప్రమత్తమయ్యామని.. వెనెజువెలా సరిహద్దుల్లో సైన్యాన్ని మోహరిస్తున్నామని కొలంబియా అధ్యక్షుడు గుస్తావో పెట్రో పేర్కొన్నారు. ఈ విషయంపై ఓఏఎస్ (ఆర్గనైజేషన్ ఆఫ్ అమెరికన్ స్టేట్స్), ఐక్యరాజ్య సమితిని వెంటనే సమావేశం కావాలని కోరారు.



## వెనెజువెలాలో పరిస్థితులు నిశితంగా పరిశీలిస్తున్నాం : విదేశాంగ శాఖ

**న్యూఢిల్లీ :** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆదేశాలతో వెనెజువెలాపై యూఎస్ మిలిటరీ చేపట్టిన సైనిక చర్యపై భారత విదేశాంగ శాఖ స్పందించింది. వెనెజువెలాలోని ప్రస్తుత పరిస్థితులను నిశితంగా పరిశీలిస్తున్నట్లు తెలిపింది. ఆ దేశంలోని భారతీయులతో వెనెజువెలాలోని భారత రాయబార కార్యాలయం సంప్రదింపులు జరుపుతోందని.. వారికి కావాల్సిన సహాయం అందిస్తోందని పేర్కొంది. భారత పౌరులు కారకాస్‌లోని రాయబార కార్యాలయంతో నిరంతరం కాంటాక్ట్‌లో ఉండాలని విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణ్‌ధీర్ జైశ్వాల్ సూచించారు. వెనెజువెలా ప్రజల శ్రేయస్సు, భద్రత విషయంలో భారత్ మద్దతు కొనసాగుతోందని హామీ ఇచ్చారు.



## వెలిమెల గ్రామాన్ని తిరిగి 263 డివిజన్‌లో కలపాలి

**బిఆర్ఎస్ తెల్లాపూర్ మాజీ సర్పంచ్ మల్లేపల్లి సోమిరెడ్డి**

**పటాన్ చెరువు, రాజముద్ర న్యూస్:** విద్యుత్ నగర్ కాలనీ (న్యూ ఎంఐజి) వెలిమెల గ్రామ ప్రజల తరపున న్యాయమైన పోరాటానికి రిలే నిరాహార దీక్షలు చేస్తున్నామని సోమిరెడ్డి అన్నారు. విద్యుత్ నగర్ కాలనీ (న్యూ ఎంఐజి) దాని ఆవిర్భావం నుండి పరిపాలన, పాలన, అభివృద్ధి, శాసనపరమైన చట్రం ఎన్నికల ఓటింగ్ వంటి ప్రతి విషయంలోనూ తెల్లాపూర్‌తో విడదీయరాని సంబంధం కలిగి ఉంది. రోజువారీ జీవితం నుండి అధికారిక ప్రభుత్వ ప్రక్రియల వరకు, ప్రజలు ఎల్లప్పుడూ తెల్లాపూర్‌ను తమ సహజ పరిపాలనా కేంద్రంగా భావించారు. ఇలాంటి పరిస్థితుల్లో ప్రజల సమ్మతి లేకుండా గ్రామ సభలు నిర్వహించకుండా గ్రామాన్ని అమీన్‌పూర్ సర్కిల్ కార్యాలయానికి మార్చాలనే అన్యాయమైన నిర్ణయం అని అన్నారు. కార్యక్రమంలో తెల్లాపూర్ మున్సిపాలిటీ మాజీ కౌన్సిలర్ లు, డివిజన్ అధ్యక్షులు రాగం దేవేందర్ యాదవ్, న్యూ ఎం ఐ జి విద్యుత్ నగర్ కాలనీ నాయకులు ప్రజలు వెలిమెల గ్రామ నాయకులు ప్రజలు పాల్గొన్నారు.



## శాశ్వత తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి

**బీర్కూర్, రాజముద్ర న్యూస్ :** బీర్కూర్ మండలం కిష్టాపూర్ గ్రామ పంచాయతీలో శాశ్వత తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని సర్పంచ్ మనెవ్వ గంగోండ తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కారానికి ఏటిగడ్డ వద్ద రెండు మోటార్లను వేయించడం జరిగిందన్నారు. ఈ రెండు మోటర్ ల వలన తాగునీటి సమస్య తీరుతుంది అన్నారు. అలాగే ప్రతి వార్డులో సింగల్ ఫేస్ మోటర్ లను బిగించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ హట్కరి కృష్ణ, జిపి సెక్రెటరీ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.



## ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ఉచిత దంత వైద్య శిబిరం ఏర్పాటు

**ఆత్మకూర్ (ఎం) రాజముద్ర న్యూస్:** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూర్ (ఎం): మండల పరిధిలోని సిద్దాపురం గ్రామంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం ఏనుగు సత్యనారాయణ రెడ్డి ఫామ్ హౌస్ లో ఉచిత మెగా దంత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఆదివారం గ్రామంలో ఉన్న సుమారు 30 మంది నిరుపేదలకు ఉచిత దంత వైద్య సహాయం అందిందని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆత్మకూరు మండల శాఖ అధ్యక్షుడు ప్రతికంఠం పూర్ణచందర్ రాజు తెలిపారు. రాబోయే బుధవారం వరకు ఈ ఉచిత మెగా దంత వైద్య శిబిరాన్ని కొనసాగిస్తున్నట్లు ఆయన తెలిపారు. పరిసర గ్రామాల ప్రజలు ఇట్టి అవకాశాన్ని సద్వినియోగ పరుచుకోవాలని కోరారు. ఈ సందర్భంగా యునైటెడ్ స్టేట్స్ అఫ్ అమెరికాకు చెందిన భారత వైద్యుడు డాక్టర్ ఉజ్వల్ రెడ్డి పర్యవేక్షణలో నిర్వహిస్తున్న ఉచిత దంత వైద్య శిబిరం గూర్చి ఆయన మాట్లాడుతూ.., గ్రామీణ ప్రాంతంలోని పేద ప్రజలకు ఉచిత వైద్య సేవలు అందించడం అదృష్టంగా భావిస్తున్నానని ఆయన అన్నారు. ఎవరికైతే మెరుగైన దంత వైద్యం అవసరమో, అలాంటి వారిని ఉచితంగా హైదరాబాదులోని ప్రముఖ దంత వైద్యశాలకు పంపిస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పల్లెర్ల గ్రామ సర్పంచ్ తండ మంజుల నర్సింహా గౌడ్, ఆత్మకూరు మాజీ ఎంపీపీ ప్రతికంఠం హేమలత రాజు, రెడ్ క్రాస్ మండల ప్రధాన కార్యదర్శి కొత్తకొండ శ్రీనివాస్, సభ్యులు తవిటి మురళీ, జెట్ట యాదగిరి, కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు పోతగాని మల్లేశం, ఎన్ఆర్ఐ లు గుమ్మి దయానంద్, ఏనుగు వెంకటరెడ్డి, ఏనుగు రామ లక్ష్మరెడ్డి మరియు గ్రామస్తులు మాద నర్సయ్య, తుమ్మల నర్సిరెడ్డి, జక్కుల ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

## ఉజ్వల పథకాన్ని సద్వినియోగం చేసుకోండి

**బిజెపి మండల అధ్యక్షుడు పాగర్తి సుధాకర్**



**ఖమ్మం, రాజముద్ర న్యూస్ :** అర్హులైన నిరుపేద మహిళలు ప్రధాన మంత్రి ఉజ్వల యోజన పథకం ద్వారా మంజూరైన గ్యాస్ కనెక్షన్ కోసం దరఖాస్తు చేసుకోవాలని బీజేపీ నేలకొండపల్లి మండల అధ్యక్షుడు పాగర్తి సుధాకర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోడీ నేతృత్వంలోని కేంద్రం ప్రభుత్వం పేద వర్గాల కుటుంబాల్లో పొగ లేని వంట గ్యాస్ కోసం ఉచితంగా ఎల్పిజీ కనెక్షన్ లను అందిస్తుందన్నారు. పేద ప్రజల అభ్యున్నతి కోసం కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పథకాలతో గ్రామీణ ప్రాంతాల ప్రజలు, యువత, రైతులు, నిరుద్యోగులు, మహిళలు బిజెపి వైపు ఆకర్షితులవుతున్నారని చెప్పారు. ఇటీవల జరిగిన పంచాయతీ ఎన్నికల్లో బిజెపి ఓటు శాతం పెరిగిందని, బూత్ ల వారిగా పార్టీ బలం పుంజుకుందని వెల్లడించారు. ఇదే స్ఫూర్తితో గ్రామ గ్రామాన భారతీయ జనతా పార్టీని బలోపేతం చేసేందుకు పార్టీ శ్రేణులు కంకణ బద్ధులై పని చేయాలని కోరారు. అదే విధంగా త్వరలో జరగబోయే ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల్లో బిజెపి జెండా ఎగరడం ఖాయమని సుధాకర్ ధీమా వ్యక్తం చేశారు.

# పేదలకు మౌలిక వసతుల కల్పన లక్ష్యంగా పటిష్ట చర్యలు

- మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి
- ఏదులాపురం మున్సిపాలిటీలో పలు అభివృద్ధి పనులకి శంఖుస్థాపన





**ఖమ్మం, రాజముద్ర న్యూస్ :** పేదలకు మౌలిక వసతుల కల్పన లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం పటిష్ట చర్యలు తీసుకుంటుందని, ఏదులాపురం మునిసిపల్ పరిధిలో గత రెండు సంవత్సరాలలో 56 కోట్ల అభివృద్ధి పనులు మంజూరు చేసామని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. ఖమ్మం రూరల్ మండలంలోని ఏదులాపురం మున్సిపాలిటీలో ఆదివారం ఆయన పర్యటించి టెంపుల్ సిటీలో 33 లక్షల 90 వేల రూపాయలతో, చిన్న తండాలో 20 లక్షల 33 వేలు, సూర్యనగర్ లో 24 లక్షల 87 వేలు, నాల్గవ తరగతి ఉద్యోగుల కాలనీలో 24 లక్షల 87 వేల రూపాయిలతో నిర్మించనున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపనలు చేసారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ ఏదులాపురం, పెద్దతండా గ్రామ పంచాయతీ పరిధిలో గత రెండు సంవత్సరాల కాలంలో 14 కోట్ల రూపాయలతో వివిధ మౌలిక వసతుల కల్పన పనులు పూర్తి చేశామని తెలిపారు. పెద్దతండాలో నూతనంగా నివాసం ఉంటున్న ప్రజలకు అవసరమైన సౌకర్యాల కల్పనకు చర్యలు తీసుకుంటామని, రాబోయే ఏప్రిల్ నెలలో మరో విడత ఇందిరమ్మ ఇండ్ల పంపిణీ కార్యక్రమం ప్రభుత్వం ప్రారంభిస్తుందని చెప్పారు. ప్రతి సంవత్సరం ఇందిరమ్మ ఇండ్ల పంపిణీ ఉంటుందని మంత్రి పొంగులేటి గుర్తు చేశారు.

### యుద్ధ ప్రాతిపదికన రిటైనింగ్ వాల్ నిర్మాణం

నాల్గవ తరగతి ఉద్యోగుల కాలనీలో గతంలో వచ్చిన వరదలు దృష్ట్యా ప్రభుత్వం నష్టపోయిన కుటుంబాలకు కొంత సహాయం చేశామని భవిష్యత్తులో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా 580 కోట్ల రూపాయలతో మున్నేరు నదికి రిటైనింగ్ వాల్ నిర్మాణాన్ని యుద్ధ ప్రాతిపదికన రాబోయే వర్షాకాలం నాటికి పూర్తి చేయనున్నట్లు మంత్రి తెలిపారు. గతంలో ఇచ్చిన మాట ప్రకారం రాబోయే 10 రోజులలో కాలనీలో అవసరమైన మరమ్మతు పనులు కూడా చేపడతామన్నారు. జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలో శంఖుస్థాపన చేసుకున్న సిసి రోడ్ల నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని మున్సిపల్ కమీషనర్ కు ఆదేశాలు జారీ చేశారు. ఏదులాపురం పట్టణ అభివృద్ధి కోసం ప్రభుత్వం ప్రత్యేకంగా నిధులు మంజూరు చేసిందని, సీసీ రోడ్లు, డ్రైయిన్ ప్రతి వార్డులో కల్పించేందుకు చర్యలు చేపడుతూ పట్టణాన్ని మోడల్ మున్సిపాలిటీగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని అన్నారు. అనంతరం మంత్రి పొంగులేటి గుర్రాలపాడు తండాలో ఇందిరమ్మ ఇళ్ల లబ్దిదారు నునావత్ భారతి నిర్మించుకున్న ఇంటిని ప్రారంభించారు. ఇందిరమ్మ ఇంటి డబ్బులు జమ అయినది అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సిపి సునీల్ దత్, ఆర్ అండ్ బి ఎస్ఈ యాకూబ్, ఇరిగేషన్ ఎస్ఈ ఎం. వెంకటేశ్వర్లు, జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య, హౌజింగ్ పిడి భూక్యా శ్రీనివాస్, ఖమ్మం ఆర్డీవో జి. నర్సింహారావు, పాలేరు నియోజకవర్గ ప్రత్యేక అధికారి రమేష్, మద్దులపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ హరినాధ్ బాబు, ఏదులాపురం మునిసిపల్ కమీషనర్ శ్రీనివాస రెడ్డి, వివిధ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు, తదితరులు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామ సమస్యలపై ఎమ్మెల్యే బీర్ల ఐలయ్యకి వినతి



**ఆత్మకూర్( ఎం) రాజముద్ర న్యూస్ :** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూర్( ఎం) రాఘవపురం గ్రామ నూతన సర్పంచ్ గా గెలిచిన యతీశ్వర్ గౌడ్. నెల రోజులలోపే ప్రధానంగా గ్రామ సమస్యలపై దృష్టి పెట్టి పాలకవర్గం మొత్తం .రాఘవాపురం గ్రామం నుండి వివిధ పార్టీల నాయకులు సుమారుగా 40 మంది వరకు స్థానిక ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ శ్రీ ిబీర్ల అయిలయ్యిని స్వయంగా వారి నివాసంలో కలవడం జరిగింది. ఎన్నో ఏళ్ల నుండి పల్లెర్ల గ్రామం నుండి రాఘవాపురం గ్రామం మీదుగా దుప్పల్లి స్టేజీ వరకి డాంబర్ రోడ్డు లేకపోవడం, ఉన్నటువంటి ఆ మట్టి రోడ్డులో అనేక ప్రమాదాలు జరగడం ముఖ్యంగా రైతులు వర్షాకాల సమయంలో చాలా ఇబ్బందులు పడడం... వంటి సమస్యల దృష్ట్యా.. గ్రామంలోని ఇట్టి సమస్యను ప్రధాన సమస్యగా చూపిస్తూ... సర్పంచ్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే గారికి వినతి పత్రాన్ని సమర్పించి పలు సమస్యలు చెప్పడం జరిగింది. ఇట్టి విషయంపై ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు. త్వరలోనే మొదటి విడత లోనే మంజూరు చేస్తాననే హామీ ఇవ్వడం జరిగింది. ఇట్టి కార్యక్రమంలో సర్పంచ్ యరుకల యతీశ్వర్ గౌడ్, ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, వివిధ పార్టీల నాయకులు వినతి పత్రం ఇచ్చిన వారిలో ఉన్నారు.



## గ్రామాభివృద్ధిలో ముందుండాలి

**ఆర్యవైశ్య ప్రజాప్రతినిధులకు ఘన సన్మానం**

**ఖమ్మం, రాజముద్ర న్యూస్ :** ఖమ్మం నగరంలోని వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో ఖమ్మం జిల్లా ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఆదివారం సన్మాన కార్యక్రమం జరిగింది. ఇటీవల జరిగిన గ్రామ పంచాయతీ ఎన్నికల్లో సర్పంచ్‌లు, వార్డు సభ్యులుగా గెలుపొందిన ఆర్యవైశ్య ప్రజాప్రతినిధులను ఈ సందర్భంగా ఘనంగా సత్కరించారు. నేలకొండపల్లి మండలం రాజారంపేట సర్పంచ్ రాయపూడి రామారావుతో పాటు వార్డు సభ్యులు వంగవీటి పవన్ కుమార్, రాయపూడి రోహిత్ (నేలకొండపల్లి), పెనుగొండ పద్మావతి (రాజేశ్వరపురం), ఆత్మకూరి ఉదయ లక్ష్మి (భానాపురం)లను అభినందించారు. వారికి పుష్పగుచ్ఛాలు అందజేసి, శాలువాలతో గౌరవించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు చెరుకూరి చందర్ రావు, భద్రాద్రి బ్యాంక్ చైర్మన్ చెరుకూరి కృష్ణమూర్తి పాల్గొన్నారు. జిల్లా, నియోజకవర్గ, మండల కమిటీల సభ్యులు మరియు ఆర్యవైశ్య ప్రముఖులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ప్రజల విశ్వాసంతో ఎన్నికైన ప్రతినిధులు గ్రామాల అభివృద్ధి, ప్రజాసేవలో ముందుండాలని నాయకులు పిలుపునిచ్చారు. సమాజానికి మేలు చేసే కార్యక్రమాల్లో ఆర్యవైశ్యులు చురుకుగా పాల్గొనాలని తెలిపారు.

# సీపీఐ నూరేళ్ల చరిత్ర



**ఖమ్మం, రాజముద్ర న్యూస్ :** భారత కమ్యూనిస్టు పార్టీ పుట్టి భారత గడ్డపై నూరేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్ రెడ్డి, ఏఐటియుసి రాష్ట్ర కార్యదర్శి సింగు నరసింహారావు, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సిహెచ్. సీతామహాలక్ష్మ నేతృత్వంలో సత్తుపల్లిలో ప్రారంభమైన సీపీఐ జిల్లా ప్రచార జాతా ఆదివారం కూసుమంచి మండల కేంద్రానికి చేరింది. ఈ సందర్భంగా మండల కార్యదర్శి భూక్య నరసింహ ఆధ్వర్యంలో ప్రచార జాతాకి ఘన స్వాగతం పలకగా తుదపరి నిర్వహించిన సమావేశంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సీతామహాలక్ష్మ మాట్లాడుతూ భారత కమ్యూనిస్టు పార్టీ నూరేళ్ల చరిత్రలో ప్రజా సమస్యల పరిష్కారానికి అలుపెరగని పోరాటాలు చేసి ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయిందన్నారు. అనేక రాష్ట్రాల్లో సాయుధ పోరాటాలు, దేశ వ్యాప్తంగా సమరశీల పోరాటాలు నిర్వహించిన చరిత్ర సిపిఐకి ఉందని గుర్తు చేశారు. కమ్యూనిస్టులపై మతోన్మాద దాడులు పెరిగిపోయాయని, ఈ క్రమంలో ప్రజలు చైతన్యవంతులై ఈ మతోన్మాద ప్రభుత్వానికి బుద్ధి చెప్పే సమయం ఆసన్నమైందని చెప్పారు. అనంతరం ప్రచార జాత మండలంలోని గైగోళ్లపల్లి, లాల్ సింగ్ సింగ్ తండా, సంధ్య తాండ మీదుగా తిరుమలయపాలెం మండలానికి చేరుకుంది. గైగోళ్ళపల్లి లో నిర్వహించిన కార్నర్ మీటింగ్ లో ఏఐటియుసి రాష్ట్ర కార్యదర్శి సింగు నరసింహారావు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ఖమ్మం జిల్లాకు ఒక సుదీర్ఘమైన చరిత్ర ఉందని, గైగోళ్ళపల్లి గ్రామానికి చెందిన పార్టీ సీనియర్ నాయకులు అమరజీవి కామ్రేడ్ సంగబత్తుల వెంకటరెడ్డి పేద ప్రజల సమస్యలపై అనేక పోరాటాలు చేసి భూమి లేని నిరుపేదలకు వందల ఎకరాల భూమిని పంచి ఇచ్చిన ఘనత ఉందన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్ రెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు కత్రోజు పాండు రంగాచారి, సీపీఐ జిల్లా సమితి సభ్యులు గుండెపొం గు మల్లేష్, మండల సహాయ కార్యదర్శి జిల్లా లింగయ్య, లాల్ సింగ్ తండా శాఖ కార్యదర్శి భూక్యా శ్రీకాంత్, గిరిజన సమాఖ్య మండల అధ్యక్షులు వీరన్న నాయక్, నాయకులు జిల్లా నాగరాజు, చెరుకుపల్లి మల్సూరు, గుండెపంగు మధు, జిల్లా రంగమ్మ, విజయ్ పాల్గొన్నారు.



## సర్పంచ్ల ఫోరం అధ్యక్షుడు ఎర్ర సోమిరెడ్డినీ శాలువతో సత్కరించిన మాజీ మంత్రి చామకూర మల్లారెడ్డి

**ఆత్మకూరు (ఎం) రాజముద్ర న్యూస్:** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు (ఎం) మండల బిఆర్ఎస్ పార్టీ సర్పంచ్ల ఫోరం అధ్యక్షులు ఎర్ర సోమిరెడ్డిని మాజీ మంత్రివర్యులు మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి శాలువతో సత్కరించడం జరిగింది. అలాగే మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి కి నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలియజేసిన బిఆర్ఎస్ పార్టీ సర్పంచ్ల ఫోరం అధ్యక్షులు ఎర్ర సోమిరెడ్డి ఈ కార్యక్రమంలో పీర్జాదిగూడ మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డి, బోడుప్పల్ మాజీ మేయర్ కొత్త లక్ష్మ రవి గౌడ్, బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## లారీ కింద పడి ఇద్దరు మృతి





**వలిగొండ. రాజముద్ర న్యూస్:** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం నర్సాపురం గ్రామం వద్ద ఉదయం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. అతివేగంగా వచ్చిన లారీ బైక్ ను ఢీకొనడంతో ఇద్దరు వ్యక్తులు అక్కడికక్కడే మృతి చెందారు. వివరాల్లోకి వెళ్తే మోత్కూరు మండలానికి సంబంధించిన దత్తప్ప గూడెం గ్రామస్తుడైన వ్యక్తి కుక్కల సాయి, దాచారం గ్రామస్తుడైన వ్యక్తి బోళ్ళ దీక్షత్ ఉదయం న లేచి భువనగిరికి బయలుదేరగా నర్సాపురం గ్రామం వద్ద లారీ ఢీకొనడంతో అక్కడికక్కడ మృతి చెందారు.



## పార్టీలకతీతంగా గ్రామ అభివృద్ధికి తోడ్పడతాము

**బిఆర్ఎస్ మాజీ సర్పంచ్ తిరుమల రెడ్డి**

**ఆత్మకూర్( ఎం )రాజముద్ర న్యూస్:** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూర్( ఎం) మండలంలోని మొరిపిరాల గ్రామ సర్పంచ్‌గా ఎన్నిక అయిన కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఆంబోజు ధనమ్మ శంకరయ్యను బిఆర్ఎస్ మాజీ సర్పంచ్ తిరుమల రెడ్డి ఆదివారం రోజు నూతన సర్పంచ్, వార్డ్ మెంబర్లను సన్మానించారు. అనంతరం మాజీ సర్పంచ్ తిరుమల రెడ్డి. మాట్లాడుతు పార్టీలకు అతీతంగా గ్రామ అభివృద్ధి కి తోడ్పడుతానని తెలిపారు. ఈ కార్యక్రమంలో తాజా మాజీ సర్పంచ్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు లక్ష్మ నారాయణ గ్రామ నాయకులు నిమ్మల దశరథ, పంజాల స్వామి వెంకట్ రెడ్డి, సామ పద్మ రెడ్డి, లి శంకరయ్య, ఇంద్రారెడ్డి, బండ రాములు, శ్రీధర్, మహేష్, సాయి రెడ్డి, గంగారం సాయి కుమార్, ముప్పిడి ప్రశాంత్, స్వామి, మహేష్, వెంకటాచారి, ఉదయ్, నారాయణరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## అక్రమంగా తరలిస్తున్న నల్లబెల్లం, పటిక, సారాయి పట్టివేత



**ఖమ్మం, రాజముద్ర న్యూస్ :** అక్రమంగా ఆటోలో తరలిస్తున్న 4 క్వింటాళ్ల నల్లబెల్లం, 20 కేజీల పటిక, 10 లీటర్ల నాటు సారాయిని నేలకొండపల్లి ప్రోహిభిషన్ అండ్ ఎక్సైజ్ అధికారులు శనివారం పట్టుకున్నారు. ప్రోహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ తెలిపిన వివరాల ప్రకారం ఖమ్మం జిల్లా ప్రోహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిప్యూటీ కమీషనర్ జి. జనార్ధనరెడ్డి, ఎక్సైజ్ అధికారి జి. నాగేందర్ రెడ్డి జనవరి 3న వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా కూసుమంచి మండలంలోని నాయకన్ గూడెం నుండి కోక్యాతండాకి తరలిస్తున్న బెల్లం, పటిక, సారాయిని పట్టుకున్నారు. పట్టుబడిన వారిలో నాయకన్ గూడెం గ్రామానికి చెందిన వంకయాల జనార్దన్, నాంపల్లి ధనలక్ష్మ, కోక్యాతండా కి చెందిన బానోత్ నరేశ్ ఉన్నారు. వీరి నుండి ఆటోని స్వాధీన పరుచుకొని, సీజ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ అధికారులు ఎస్. రమేష్, ప్రోహిభిషన్ అండ్ ఎక్సైజ్ ఎస్సై టి. లత, హెడ్ కానిస్టేబుల్ పి. శ్రీనివాసరావు, సిబ్బంది ఎస్. బలరాం, జె. రామారావు, ఎన్. వినీత్, డి. సునీత, పి. శ్రీలక్ష్మ, వి. సంపూర్ణమ్మ, తదితరులు పాల్గొన్నారు.

# సోమనాథ్ ఆత్మగౌరవ పర్వం

## సహస్రాబ్ద అఖండ విశ్వాసం (1026-2026)

**సోమనాథ్... ఈ పదం చెవినబడగానే మన హృదయాంతరాళం పులకాంకితమై, మదిలో సగర్వ భావన మెదలుతుంది. ఇది భారతీయాత్మ అనంత స్పందన. ఈ అద్భుత ఆలయం పశ్చిమ భారత తీరంలోని గుజరాత్ రాష్ట్రం ప్రభాస్ పటాన్ అనే ప్రదేశాన్ని పావనం చేస్తోంది. దేశంలోని 12 జ్యోతిర్లింగాల ప్రాశస్త్యాన్ని 'ద్వాదశ జ్యోతిర్లింగ' స్తోత్రం ప్రస్తుతిస్తుంది. "సౌరాష్ట్రే సోమనాథం చ..." అంటూ ఆరంభమయ్యే ఈ స్తోత్రం, తొలి జ్యోతిర్లింగ నెలవుగా సోమనాథ్ నాగరికత, ఆధ్యాత్మిక ప్రాధాన్యాన్ని ప్రతిబింబిస్తుంది. అంతేకాకుండా ఈ శ్లోకం జ్యోతిర్లింగ మహత్తును ఇలా చాటిచెబుతుంది.**

సోమలింగం నరో దృష్ట్వా సర్వపాపైః ప్రముచ్యతే|
లభతే ఫలం మనోవాంఛితం మృతః స్వర్గం సమాశ్రయేత్||

అంటే– "సోమనాథ్ శివలింగ దర్శన మాత్రాన జీవుడు పాప విముక్తుడై సదాశయాలను నెరవేర్చి, మరణానంతరం స్వర్గ ప్రాప్తినొందుతాడు" అని అర్థం. కానీ, లక్షలాది భక్తజనం భక్తిప్రపత్తులతో నీరాజనాలు అర్పించిన ఈ సోమనాథ్‌పై దురదృష్టవశాత్తూ విధ్వంసమే ఏకైక ధ్యేయంగా విదేశీ దురాక్రమణదారులు దండయాత్రలు చేశారు. ఈ నేపథ్యంలో సోమనాథ ఆలయానికి 2026 సంవత్సరం ప్రత్యేకమైనది. ఈ ఐతిహాసిక పుణ్య క్షేత్రంపై తొలి దాడికి ఈ ఏడాదిలో వెయ్యేళ్లు పూర్తవుతున్నాయి. గజనీ మహమ్మద్ 1026 జనవరిలో క్రూర, హింసాత్మక దండయాత్రలో భాగంగా ఈ ఆలయంపై దాడి చేశాడు. ప్రజల భక్తివిశ్వాసాలకు, నాగరికతకు సుసంపన్న ప్రతీక అయిన ఈ ఆలయాన్ని ధ్వంసం చేయజూశాడు.

అయితే, సోమనాథ్‌కు పూర్వ వైభవం దిశగా ఏళ్లపాటు సాగిన అవిరళ కృషి ఫలితంగా వెయ్యేళ్ల తర్వాత కూడా ఈ ఆలయ దివ్య దీప్తి ప్రపంచవ్యాప్తంగా ప్రకాశిస్తోంది. ఇటువంటి ప్రయత్నాల్లో ఒక ఘట్టానికి 2026లో 75 సంవత్సరాలు పూర్తవుతాయి. ఈ మేరకు ఆలయ పునరుద్ధరణ అనంతరం 1951 మే 11వ తేదీన అప్పటి రాష్ట్రపతి డాక్టర్ రాజేంద్ర ప్రసాద్ సమక్షన నిర్వహించిన కార్యక్రమంలో భక్తులకు జ్యోతిర్లింగ భాగ్యం కల్పిస్తూ ఆలయం తలుపులు తెరుచుకున్నాయి. సోమనాథ్‌పై వెయ్యేళ్ల నాటి తొలి దండయాత్ర, అక్కడి దురాక్రమణదారుల క్రూరత్వం, పుణ్యక్షేత్ర విధ్వంసం వంటి అమానుష ఘట్టాలను వివిధ చారిత్రక గ్రంథాలు సవివరంగా నమోదు చేశాయి. వాటిని చదివే ప్రతి పాఠకుడి గుండె విలవిలలాడుతూ లిప్తపాటు విచలితమవుతుంది. ప్రతి పంక్తిలోనూ బట్టబయలయ్యే హింస, క్రూరత్వం వెయ్యేళ్లు గడిచినా మరపురాని విషాద భారాన్ని మన మనోఫలకంపై మోపుతాయి. భారత దేశంపైన, ప్రజల మనోధైర్యం మీద అది చూపిన పెను దుష్ప్రభావాన్ని ఒకసారి ఊహించండి. సముద్ర తీరంలోగల సోమనాథ్ ఆలయం అమేయ ఆర్థిక శక్తితో సమాజానికి సాధికారతనిచ్చింది. అన్నింటినీ మించి సోమనాథ్‌కు విశేష ఆధ్యాత్మిక ప్రాధాన్యం ఉంది. నాటి సమాజంలోని సముద్ర వ్యాపారులు, నావికులు సోమనాథ్ వైభవ గాథలను దేశదేశాలకు విస్తృతంగా మోసుకెళ్లారు. అయినప్పటికీ, తొలి దాడికి సహస్రాబ్ది పూ-ర్తయ్యాక కూడా సోమనాథ్ గాథ విధ్వంస నిర్వచనంగా నిలవకపోవడంపై నిస్సందేహంగా నేనెంతో గర్విస్తున్నాను. ఈ ఆలయం ఈనాడు భరతమాత కోట్లాది బిడ్డల అఖండ ధైర్యానికి నిర్వచనంగా నిలుస్తోంది.

ఎన్నడో వెయ్యేళ్ల కిందట 1026లో మొదలైన మధ్యయుగపు అనాగరిక దండయాత్ర, ఇతరులను కూడా సోమనాథ్‌పై పదేపదే దాడులకు 'ప్రేరేపించింది.' దేశ ప్రజలను, సంస్కృతిని దాస్య శృంఖలాల్లో బంధించే ప్రయత్నాలకు నాంది పలికింది. కానీ, ఆలయంపై దాడి జరిగిన ప్రతి సందర్భంలోనూ రక్షణ కుడ్యంలా నిలిచి, ఆత్మార్పణకూ వెరవని వీరపుత్రులు, పుత్రికలు ఎందరో ఉన్నారు. దాడి జరిగిన ప్రతిసారి మనదైన గొప్ప నాగరికతకు వారసులుగా వారు పుంజుకుంటూ తరతరాలుగా ఆలయ పునర్నిర్మాణం, పునరుజ్జీవనానికి పాటుపడుతూనే వచ్చారు. ఇటువంటి మహనీయులలో అహల్యాబాయి హోల్కర్ ప్రముఖులు. సోమ్‌నాథ్‌లో భక్తులు ప్రార్థనలు చేసుకునేలా ఆమె అందించిన అవిరళ కృషి వెలకట్టలేనిది. అటువంటి మహానుభావులు జీవించిన నేలపై నడయాడగలగటం నిజంగా మన అదృష్టం.

స్వామి వివేకానంద 1890 దశకంలో సోమనాథ్‌ను సందర్శించినపుడు అనిర్వచనీయ అనుభూతికి లోనయ్యారు. నాటి తన అనుభవాన్ని 1897లో చెన్నై నగరంలో ఓ కార్యక్రమం సందర్భంగా– "దక్షిణ భారతంలోని ప్రాచీన ఆలయాలతోపాటు గుజరాత్‌లోని సోమనాథ్ వంటివి మనకు అపార జ్ఞానప్రదాతలు. ఎన్నో పుస్తకాలు వివరించలేని జాతి చరిత్రపై మనకు మరింత లోతైన అవగాహనను అందిస్తాయి. వంద దాడులను భరించిన గుర్తులతోనే కాకుండా వంద పునరుజ్జీవన చిహ్నాలతో ఈ ఆలయాలు ఎంత వైభవంగా నిలిచాయో గమనించండి. నిరంతర విధ్వంసం, శిథిలాల నుంచి నిరంతర పునరుజ్జీవనంతో మునుపటి ఠీవితో ఎంత శక్తిమంతంగా విలసిల్లుతున్నాయో చూడండి! అదే జాతీయ మనోభావనా జాతీయ జీవన స్రవంతి. అనుసరిస్తే అది అమేయ యశస్సు వైపు మనల్ని నడిపిస్తుంది. ఆ జీవన స్రవంతిని వీడితే ఫలితం మరణమే! ఆ మార్గం వదిలిపెడితే ప్రభావం ఆత్మనాశనం, వినాశమే!" స్వాతంత్ర్యానంతరం సమర్థుడైన ఉక్కుమనిషి సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ సోమనాథ ఆలయ పునర్నిర్మాణ పవిత్ర బాధ్యతను స్వీకరించారు. 1947లో దీపావళి వేళ ఆ ప్రాంతంలో ఆయన పర్యటించారు. అక్కడి పరిస్థితులను చూసి చలించిపోయిన సర్దార్ పటేల్.. అక్కడే ఆలయాన్ని పునర్నిర్మిస్తామని ప్రకటించారు. చివరికి 1951 మే 11న సోమనాథ్‌లో భవ్యమైన ఆలయ ద్వారాలు భక్తుల కోసం తెరచుకున్నాయి. డాక్టర్ రాజేంద్ర ప్రసాద్ ఆ వేడుకకు హాజరయ్యారు. ఈ చారిత్రక ఘట్టాన్ని వీక్షించాలని కలలుగన్న యోధుడు సర్దార్ సాహెబ్ ఆ సమయానికి భౌతికంగా ఈ లోకంలో లేరు. కానీ, ఆయన స్వప్నం



సాకారమై దేశం ఎదుట సగర్వంగా నిలిచింది. నాటి ప్రధానమంత్రి పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ ఈ పరిణామం పట్ల అంతగా ఉత్సాహం చూపలేదు. ఎంతో విశిష్టమైన ఈ కార్యక్రమంలో గౌరవ రాష్ట్రపతి, మంత్రులు పాల్గొనడం ఆయనకు ఇష్టం లేదు. ఈ కార్యక్రమం భారత్‌పై ప్రతికూల ముద్ర వేసిందని నెహ్రూ వ్యాఖ్యానించారు. కానీ డాక్టర్ రాజేంద్ర ప్రసాద్ తన నిర్ణయానికి దృఢంగా కట్టుబడి ఉన్నారు. అనంతర పరిణామాలు చరిత్ర పుటల్లో నిలిచే ఉన్నాయి. సర్దార్ పటేల్‌కు ఎంతో అండగా నిలిచిన కె.ఎం. మున్షీని స్మరించుకోకపోతే సోమనాథ్ గాథ అసంపూర్ణమే అవుతుంది. 'సోమనాథ: నిత్య క్షేత్రం (సోమనాథ: ది ష్రైన్ ఎటర్నల్)' గ్రంథంతోపాటు.. సోమనాథ్‌పై ఎన్నో సమాచారభరిత, విజ్ఞానదాయకమైన రచనలు చేశారు.

నిజానికి, మున్షీ తన గ్రంథ శీర్షికలో చెప్పినట్టు.. ఆత్మ నిత్యత్వాన్నీ, ఉన్నత భావాల శాశ్వతత్వాన్నీ బలంగా విశ్వసించే గొప్ప నాగరికత మనది. 'నైనం ఛిందన్తి శస్త్రాని' అని గీతలో చెప్పినట్టు ఉ అది ధ్వంసం చేయ శక్యంగాని అజరామరత్వమని మనం బలంగా నమ్ముతాం. మన నాగరికత అజేయ స్ఫూర్తికి సోమనాథ్‌ను మించిన ఉదాహరణ మరొకటి లేదు. ఎన్నో అవరోధాలనూ, ఆటుపోట్లనూ ఎదుర్కొని వైభవోపేతంగా నిలిచిన సోమనాథ్ కన్నా మిన్నగా మరేది దీన్ని వివరించగలదు? వందల ఏళ్ల దాడులనూ, వలసవాద దోపిడీనీ తట్టుకొని నిలబడి.. నేడు ప్రపంచ వృద్ధిలో అత్యంత ఆశాజనకమైన దేశంగా ఎదిగిన భారత ప్రగతిలోనూ ఇదే స్ఫూర్తి తొణికిసలాడుతోంది. నేడు భారత్ ప్రపంచం దృష్టిని ఆకర్షిస్తోందంటే.. మన విలువలు, భారతీయుల దృఢ సంకల్పమే దానికి మూలం. ప్రపంచం ఆశతో, ఆశాభావంతో భారత్‌ను చూస్తోంది. సృజనాత్మకత నిండిన మన యువతపై విశ్వాసంతో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి చూపుతోంది. మన కళ, సంస్కృతి, సంగీతం, పండుగలు ఇప్పుడు విశ్వవ్యాప్తమవుతున్నాయి. యోగా, ఆయుర్వేదం ప్రపంచవ్యాప్తంగా ప్రభావం చూపుతూ, ఆరోగ్యకరమైన జీవనశైలిని ప్రోత్సహిస్తున్నాయి. ప్రపంచాన్ని పట్టిపీడిస్తున్న కొన్ని అత్యంత తీవ్రమైన సవాళ్లకు భారత్ పరిష్కారాలను చూపుతోంది.

అనాది కాలం నుంచి వివిధ వర్గాల ప్రజలను సోమనాథ్ ఏకం చేస్తోంది. శతాబ్దాల కిందటే పూజ్య జైన సన్యాసి కలికాల సర్వజ్ఞ హేమచంద్రాచార్యులు సోమనాథ్‌కు వచ్చారు. అక్కడ ప్రార్థన అనంతరం.. 'భవబీజాంకురజననా రాగాద్యాః క్షయముపగతా యస్య' అనే శ్లోకాన్ని ఆయన చెప్పాడంటారు. అంటే "లౌకిక కర్మ బీజాలను నశింపజేసే వాడికీ.. రాగద్వేషాలనూ, సమస్త క్లేశాలనూ తుడిచిపెట్టే వాడికీ వందనాలు" అని అర్థం. నేడు మన మనస్సులోనూ, ఆత్మలోనూ ఒక బలమైన చైతన్యాన్ని రగిలించే అద్భుత శక్తి సోమనాథ్‌కు ఉంది. 1026లో మొదటిసారి దాడి జరిగి వెయ్యేళ్లు గడిచినా.. సోమనాథ్ వద్ద సాగరం నేటికీ అంతే గంభీరంగా గర్జిస్తోంది. సోమనాథ్ తీరాన్ని తాకే అలలు అద్భుతమైన కథను చెబుతున్నాయి. ఆటంకాలెన్నెదురైనా.. ఆ అలల మాదిరిగానే మళ్లీ సోమనాథ అభ్యుదయం తథ్యం.ల

నాటి దురాక్రమణదారులు నేడు గాలిలో కలిసిన ధూళి కణాలయ్యారు. వారి పేర్లు విధ్వంసానికి పర్యాయపదాలుగా మిగిలాయి. వారంతా చరిత్ర గ్రంథాల్లో పాదసూచికలు మాత్రమే. సోమనాథ్ మాత్రం దిగంతాలకు అతీతంగా దేదీప్యమై వెలుగులు విరజిమ్ముతోంది. 1026 నాటి దాడితో ఏమాత్రమూ చెక్కుచెదరని ఆ అజేయమైన, చిరతరమైన స్ఫూర్తిని మనకు గుర్తు చేస్తూనే ఉంటుంది. సోమనాథ్ ఒక ఆశా గీతం. ద్వేషం, మతోన్మాదాలకు తాత్కాలికంగా ధ్వంసం చేసే శక్తి ఉండవచ్చు. కానీ సత్యమూ, ధర్మంపై అచంచలమైన విశ్వాసమూ అమ-రత్వాన్ని సృజించగలవని సోమనాథ్ చాటుతోంది.

వెయ్యేళ్ల కిందట దాడికి గురై, తర్వాత కూడా నిరంతర దాడులను ఎదుర్కొన్న సోమనాథ ఆలయం మళ్లీ మళ్లీ సగర్వంగా నిలిచినట్టే.. మనం కూడా పరాయి దండయాత్రలకు ముందున్న, వెయ్యేళ్ల కిందటి మన దేశ మహా వైభవాన్ని పునరుద్ధరించుకుని తీరుతాం. శ్రీ సోమనాథ మహాదేవుడి ఆశీస్సులతో, వికసిత భారత నవ సంకల్పంతో మనం ముందుకు సాగుతున్నాం. విశ్వకల్యాణమే పరమావధిగా.. మన నాగరికతా స్ఫూర్తి దిశానిర్దేశం చేస్తోంది.

జై సోమనాథ్!

(నరేంద్ర మోదీ – భారత ప్రధానమంత్రి, శ్రీ సోమనాథ్ ట్రస్టు చైర్మన్)

## మానసిక ఆందోళనలతో వ్యక్తి ఆత్మహత్య



**బీర్కూర్, రాజమండ్రి న్యూస్ :** మానసిక ఆందోళనతో మృతి చెందిన సంఘటన బీర్కూర్ మండలం వీరాపూర్‌లో చోటు చేసుకుంది. వివరాలకి వెళితే వీరాపూర్ గ్రామానికి చెందిన మచ్చుర్ ప్రహ్లాద్ (34) అనే యువకుడు వెల్లుల్లి రసం తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అతనిని బాన్సువాడ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించగా, డాక్టర్లు నిజామాబాద్ జనరల్ ఆసుపత్రికి రిఫర్ చేయగా, శనివారం రాత్రి 8 గంటల సమయంలో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. గతంలో మూడుసార్లు ఆత్మహత్యానికి పాల్పడినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు, ప్రహ్లాద్ భార్య 9 నెలల గర్భవతి, ముగ్గురు ఆడపిల్లలు ఉన్నారు. భార్య సౌందర్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు బీర్కూర్ పోలీసులు తెలిపారు.



## మేడారం.. భారీగా తరలివచ్చిన భక్త జనం

**ములుగు :** ములుగు జిల్లాలోని మేడారం మహా జాతర సమీపించేకొద్దీ వనదేవతలు సమ్మక్క, సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజును దర్శించుకొనేందుకు వచ్చే భక్తుల సంఖ్య భారీగా పెరుగుతోంది. ఆదివారం సెలవు దినం కావడంతో తెలుగు రాష్ట్రాలతో పాటు ఇతర ప్రాంతాల నుంచి కూడా వేలాదిగా తరలిరావడంతో మినీ జాతరను తలపించింది. కుటుంబ సభ్యుల సమేతంగా వచ్చినవారు ముందుగా జంపన్న వాగులో స్నానాలు చేసి, అక్కడే జంపన్న, నాగులమ్మకు ముడుపులు కట్టారు. అనంతరం గద్దెల వద్దకు చేరుకొని దేవతలను దర్శించుకొని బంగారం (బెల్లం), పసుపు, కుంకుమ, సారె సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు జంపన్నవాగు, గద్దెల ప్రాంగణంలో ఉదయం నుంచి రాత్రి వరకు భక్తుల రద్దీ కొనసాగింది. జాతర ప్రధాన రహదారులన్నీ వాహనాలతో నిండిపోయాయి. మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సీతక్క, ఎంపీ బలరాంనాయక్, అధికారులు కూడా దేవతల దర్శనం, పనుల పర్యవేక్షణకు రావడంతో కాన్వాయ్‌లతో కొంత ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తాయి.

## ప్రైవేట్ ఉపాధ్యాయుల హక్కుల రక్షణకు విద్యా శాఖ కృషి

### మేడిపల్లి మండల విద్యాధికారి శ్రీనివాస్ రెడ్డి



**బోడుప్పల్, రాజమండ్రి న్యూస్:** ప్రయివేటు ఉపాధ్యాయుల హక్కుల రక్షణకు ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుంటుందని మేడిపల్లి మండల విద్యాధికారి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ఆదివారం నాడు మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా బోడుప్పల్ లోని నారాయణ ఒలింపియాడ్ స్కూల్ వద్ద జిల్లా స్థాయి టీచర్స్ సదస్సు జరిగింది. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన మేడిపల్లి బోడుప్పల్ ఎంఈవో శ్రీనివాస్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రైవేట్ టీచర్ల సమస్యలను గుర్తిస్తుందని, వారికి కూడా హక్కులు ఉన్నాయని వాటి అమలుకు తప్పక ప్రయత్నిస్తున్నామని అన్నారు. రెండవ శనివారం సెలవు తప్పక ఇవ్వాలని, ఇవ్వని పాఠశాలల అంశం మా దృష్టికి తీసుకువస్తే ఆ స్కూల్స్ పై చర్యలు తీసుకుంటామని తెలిపారు. విద్యాసంస్థలు అన్ని ప్రభుత్వ మార్గదర్శకాలు పాటించాలని ఒత్తిడి తెస్తున్నామని చెప్పారు. మరో ముఖ్య అతిథిగా హాజరైన అనురాగ్ యూనివర్సిటీ డైరెక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రైవేట్ ఉపాధ్యాయుల సమస్యలు అనేకం ఉన్నాయని వాటిని ధైర్యంగా ఎదుర్కోవాలని సూచించారు. అలాగే టీచింగ్ ఫీల్డ్ చాలా బాధ్యతతో కూడుకున్నదని విద్యార్థులను బాగా తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులదేనని అన్నారు. దేశ భవిష్యత్ విద్యారంగం మీదే ఆధారపడి ఉంటుందని ఉపాధ్యాయులు ముఖ్యం కాబట్టి సైంటిఫిక్‌గా వ్యవహరించాలని అన్నారు. రాష్ట్ర కార్యదర్శి ఏ. విజయ్ కుమార్ మాట్లాడుతూ ప్రైవేట్ టీచర్స్ విద్యారంగానికి చేస్తున్న సేవలు చాలా విలువైనది. అందుకే ప్రభుత్వం వీరి సమస్యలు తప్పక పరిష్కరించాలి. ఈఎస్ఐ, పి ఎఫ్, బీమాలు తప్పక ప్రతి పాఠశాల అమలు చేయాలి. ప్రైవేట్ టీచర్స్ కి ప్రభుత్వం ఒక కార్పొరేషన్, వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేసి దానికి ఫండ్స్ కేటాయించాలని, ప్రతి టీచర్ సర్వీస్ ను మొదటి రోజు నుంచి లెక్కకట్టాలి. అలాగే సావిత్రి బాయి స్ఫూర్తితో టీచర్స్ ఐక్యం అయ్యి పోరాడాలని పిలుపునిచ్చారు. సభ అనంతరం ఈ కార్యక్రమానికి సురేందర్ అధ్యక్షత వహించగా, అతిథులుగా టీఎల్పీఎల్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కొమ్ము విజయ్ కుమార్, పి.విజయ్, నారాయణ స్కూల్ ప్రిన్సిపాల్ సత్యవాణి,డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి అనగంటి వెంకటేష్, హైద్రాబాద్ నాయకుడు జావేద్, రాజన్న లు హాజరుకాగా, స్కూల్ ప్రిన్సిఫాల్స్ ప్రవీణ, శిరీష, సుభాషిణి, ఇంద్రా రెడ్డి, లావణ్యలు, టీఎల్పీఎల్ఎఫ్ నాయకులు సుధాకర్, రవి, వేముల శ్రీనివాస్, ప్రైవేట్ టీచర్స్, లెక్చరర్స్ పాల్గొన్నారు.

## అంగరంగ వైభవంగా భ్రమరాంబ మల్లికార్జున స్వామి కళ్యాణ మహోత్సవం





**శేరిలింగంపల్లి, రాజమండ్రి న్యూస్:** శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి కేతమ్మల కళ్యాణ మహోత్సవం ఆదివారం హఫీజ్ పేటలో ఘనంగా జరిగింది. శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి దేవాలయ ప్రాంగణంలో నిర్వహించిన ఈ కళ్యాణ మహోత్సవంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని పూజా కార్యక్రమాలు నిర్వహించారు. హఫీజ్ పేటకు చెందిన దేవాలయ ధర్మకర్తలు నిమ్మల ప్రకాష్ పటేల్ గౌడ్, నిమ్మల రాంబాబు పటేల్ గౌడ్, నిమ్మల దేవేందర్ పటేల్ గౌడ్ ల ఆధ్వర్యంలో నిర్వహించబడిన ఈ కళ్యాణ మహోత్సవంలో తెప్పోత్సవం కూడా ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భారీ ఎత్తున అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. పలువురు కార్పొరేటర్లతో పాటు వివిధ పార్టీలకు చెందిన నాయకులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

మద్యం కొంచెం తాగినా నోటి క్యాన్సర్ ముప్పు పెరుగుతుండటం గమనార్హం. రోజుకు బీరు నుంచి 2 గ్రాములు.. విస్కీ లేదా వోడ్కా నుంచి 9 గ్రాములు (సుమారు ఒక గ్లాసు) ఆల్కహాల్ తీసుకున్నా ప్రమాదం పొంచి ఉంటోంది. మద్యానికి సురక్షత రకం, పరిమితంటూ ఏదీ లేదు. రోజుకు కొద్దిగా బీరు తాగినా నోటి క్యాన్సర్ ముప్పు పెరుగుతున్నట్టు టాటా మెమోరియల్ సెంటర్‌కు చెందిన క్యాన్సర్ విభాగం పరిశోధనలో తేలింది మరి. బీరు అసలే తాగనివారితో పోలిస్తే- రోజుకు సగటున 2 గ్రాముల ఆల్కహాలు లభించేంత బీరు తాగినా నోటి క్యాన్సర్ వచ్చే అవకాశం 59% ఎక్కువగా ఉంటున్నట్టు పరిశోధకులు గుర్తించారు. ఎంత ఎక్కువగా మద్యం తాగితే అంత ఎక్కువగా నోటి క్యాన్సర్ ముప్పు పెరుగుతుండటం గమనార్హం. బుగ్గల లోపల జిగురుపొరలో తలెత్తే క్యాన్సర్‌కూ మద్యం వాడకానికీ మధ్య సంబంధాన్ని గుర్తించటానికి మనదేశంలో చేపట్టిన అతిపెద్ద అధ్యయనం ఇదే. మనదగ్గర ఏటా కొత్తగా 1.40 లక్షల నోటి క్యాన్సర్ కేసులు నమోదవుతుండగా.. 80వేల మరణాలు సంభవిస్తున్నాయి. ఈ నేపథ్యంలో తాజా అధ్యయనం కళ్లు తెరవాలని సూచిస్తోంది.



# మద్యం కొంచెం తాగినా ఆరోగ్యానికి ముప్పే


## నోటి క్యాన్సర్ పెరుగుతుండటం గమనార్హం



- నియంత్రించని, స్థానికంగా తయారైన మద్య పానీయాల్లో ఇథనాల్ మోతాదు చాలా ఎక్కువగా ఉంటున్నట్టు, వీటితో నోటి క్యాన్సర్ ముప్పు మరింత పెరుగుతున్నట్టూ పరిశోధకులు గుర్తించారు. నియంత్రణలో ఉన్న మద్యం తాగేవారికి 72% ముప్పు పొంచి ఉంటే.. స్థానిక మద్యాలతో ఇది 87 శాతానికి ఎగబాకుతోందని వివరిస్తున్నారు.
- మద్యానికి పొగాకు కూడా కలిస్తే అగ్నికి ఆజ్యం పోసినట్టే. ఎన్నడూ మద్యం తాగని, పొగాకు నమలని వారితో పోలిస్తే రోజుకు ఒక గ్లాసు కన్నా ఎక్కువ ఆల్కహాల్ తీసుకునేవారికి, పొగాకు నమిలేవారికి నోటి క్యాన్సర్ ముప్పు దాదాపు ఐదు రెట్లు అధికం. పొగాకు నమలటం వల్ల 200%, మద్యం తాగటంతో నోటి క్యాన్సర్ ముప్పు 76% ఎక్కువవుతుండగా.. ఇవి రెండూ కలిస్తే 346% వరకూ ముప్పు పెరుగు తుండటం ఆందోళనకరం. మనదేశంలో నమోదయ్యే నోటి క్యాన్సర్లలో 62% కేసులకు ఈ రెండే కారణమవుతున్నాయి. నోటి క్యాన్సర్ ముదిరినవారిలో 57% మంది తొలి ఐదేళ్లలోనే మరణిస్తున్నారు. అందువల్ల దీన్ని నివారించుకోదగిన కారకాలను గుర్తించి, వాటికి దూరంగా ఉండటానికి ప్రాధాన్యం పెరుగుతోంది.

# ఆండ్రాయిడ్ ఫోన్లలో ఎమర్జెన్సీ లొకేషన్ సేవలు

భారత్‌లోని ఆండ్రాయిడ్ స్మార్ట్‌ఫోన్ వినియోగదారుల కోసం గూగుల్ కొత్త ఫీచర్ తీసుకొచ్చింది. దేశంలో ఎమర్జెన్సీ లొకేషన్ సేవలను (ఇఎల్ఎస్) ప్రారంభించింది. పోలీస్, అగ్నిమాపక, వైద్యం వంటి అత్యవసర సేవల విభాగానికి కాల్ లేదా టెక్స్ట్ చేసినప్పుడు ఈ ఫీచర్ ద్వారా మీ లొకేషన్ లభిస్తుంది. ఈ సేవలను పొందాలంటే ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు తమ అత్యవసర సేవలతో ఈఎల్ఎస్‌ను అనుసంధానించాల్సి ఉంటుంది. తొలుత ఉత్తర్‌ప్రదేశ్ పోలీసు విభాగం ఈ సేవలను అందిపుచ్చుకుంది. ఆండ్రాయిడ్ ఫోన్ నుంచి ఎవరైనా అత్యవసర సేవల విభాగానికి ఫోన్ చేయగానే ఆటోమేటిక్‌గా వారి కచ్చితమైన లొకేషన్ వివరాలు అవతలి వారికి చేరుతాయి. ఏదైనా కారణంతో క్షణాల్లో కాల్ కట్ అయినా లొకేషన్ వివరాలు అందుతాయి. జీపీఎస్, వైఫై, సెల్యులర్ నెట్‌వర్క్ ఆధారంగా ఈఎల్ఎస్ పనిచేస్తుంది. 112 లేదా ఇతర ఎమర్జెన్సీ నంబర్‌కు కాల్ చేసినప్పుడు ఈ ఫీచర్ పనిచేస్తుంది. దీనికి అదనపు హార్డ్‌వేర్‌గానీ, యాప్స్ గానీ అవసరం లేదని గూగుల్ స్పష్టంచేసింది. ఉత్తర్‌ప్రదేశ్ మాదిరిగా ఇతర రాష్ట్రాలూ దీన్ని అందిపుచ్చుకోవాలని సూచించింది. ఆండ్రాయిడ్ 6, ఆపై వెర్షన్ డివైజులకు ఈ ఫీచర్ పనిచేస్తుందని తెలిపింది. ఈ డేటాను గూగుల్ కలెక్ట్ చేయబోదని గూగుల్ స్పష్టంచేసింది.



## శ్రీలంకలో బంగ్లాదేశ్ మ్యాచ్‌లు?

# అంత ఈజీ కాదు : బీసీసీఐ

భారత్‌తో రాజకీయ ఉద్రిక్తతలు పెరుగుతున్నందున బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వం ఆ దేశ క్రికెట్ బోర్డుకి కీలక సూచనలు చేసింది. 2026 టీ20 ప్రపంచ కప్‌లో బంగ్లా.. భారత్‌లో ఆడాల్సిన మ్యాచ్‌ల వేదికలను శ్రీలంకకు తరలించాల్సిందిగా ఐసీసీని అభ్యర్థించాలని సూచించింది. ఈ విషయాన్ని బంగ్లాదేశ్ క్రీడా సలహాదారు ఆసిఫ్ నజ్రుల్ ధ్రువీకరించారు. అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్‌కి అధికారికంగా తెలియజేయాలని, టోర్నమెంట్‌లో బంగ్లాదేశ్ మ్యాచ్‌లకు ప్రత్యామ్నాయ వేదికగా శ్రీలంకను ప్రతిపాదించాలని తాత్కాలిక ప్రభుత్వం బీసీబీని ఆదేశించినట్లు నజ్రుల్ సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ పెట్టారు. 'క్రీడా మంత్రిత్వ శాఖకు ఇంఛార్జి సలహాదారుగా, ఈ మొత్తం విషయాన్ని లిఖితపూర్వకంగా ఐసీసీకి వివరించాలని క్రికెట్ కంట్రోల్ బోర్డుని ఆదేశించాను.

ఒక బంగ్లాదేశ్ క్రికెటర్ (ముస్తాఫిజుర్ రెహమన్)తో కాంట్రాక్ట్ పొందినప్పటికీ భారత్‌లో (ఐపీఎల్) ఆడలేకపోతే.. టీ20 ప్రపంచ కప్ ఆడటానికి బంగ్లాదేశ్ జాతీయ జట్టు భారత్‌కు ప్రయాణించడం సురక్షతంగా ఉండదని బోర్డు స్పష్టం చేయాలి. ప్రపంచ కప్‌లో బంగ్లాదేశ్ మ్యాచ్‌లను శ్రీలంకలో నిర్వహించాలని అధికారికంగా అభ్యర్థించాలని ఆదేశించాను' అని నజ్రుల్ తన పోస్ట్‌లో పేర్కొన్నారు.అయితే, టోర్నీ ఆరంభానికి నెల రోజుల సమయమే ఉండటంతో వేదికలను మార్చడం అసాధ్యమని బీసీసీఐ వర్గాలు చెబుతున్నాయి. 'ఒకరి ఇష్టానుసారం మీరు వేదికలను మార్చలేరు. ప్రయాణపరంగా చాలా ఇబ్బందులు ఎదురవుతాయి. బంగ్లాదేశ్‌తో ఆడే ఇతర జట్ల గురించి కూడా ఆలోచించండి. వారి విమాన టిక్కెట్లు, హొటళ్లు బుక్ అయ్యాయి. టోర్నీలో లీగ్ దశలో ప్రతిరోజు మూడు మ్యాచ్‌లు ఉంటాయి. ఇందులో ఒకటి శ్రీలంకలో జరుగుతుంది. బ్రాడ్‌కాస్టింగ్ విషయంలోనూ సమస్యలొస్తాయి. కాబట్టి.. మ్యాచ్‌ల తరలింపు అనేది అనుకున్నంత ఈజీ కాదు' అని బీసీసీఐ వర్గాలు తెలిపాయి.ఫిబ్రవరి 7 నుంచి ప్రారంభం కానున్న టీ20 వరల్డ్ కప్‌నకు భారత్, శ్రీలంక సంయుక్తంగా ఆతిథ్యమివ్వనున్న సంగతి తెలిసిందే. గ్రూప్ స్టేజ్‌లో బంగ్లాదేశ్ ఆడాల్సిన నాలుగు మ్యాచ్‌లను భారత్‌లోనే షెడ్యూల్ చేశారు. ఈడెన్ గార్డెన్స్ వేదికగా ఫిబ్రవరి 7న వెస్టిండీస్, 9న ఇటలీ, 14న ఇంగ్లాండ్, 17న వాంఖడేలో నేపాల్‌తో మ్యాచ్‌లు ఆడాల్సి ఉంది. బంగ్లాదేశ్‌లో హిందువులపై వరుస దాడుల నేపథ్యంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. బంగ్లాదేశ్ ఆటగాడు ముస్తాఫిజుర్ రెహమాన్‌ను ఐపీఎల్ 2026 మినీ వేలంలో రూ.9.2 కోట్లకు కోల్‌కతా నైట్ రైడర్స్ కొనుగోలు చేసింది. ముస్తాఫిజుర్‌ను ఐపీఎల్‌లో ఆడించనుండటంపై తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. దీన్ని పరిగణనలోకి తీసుకున్న బీసీసీఐ.. ముస్తాఫిజుర్‌ను రిలీజ్ చేయాలని కేకేఆర్ ఫ్రాంఛైజీని ఆదేశించింది. దీంతో అతడిని కోల్‌కతా జట్టు నుంచి రిలీజ్ చేసింది. ఈ పరిణామాల నేపథ్యంలో భారత్‌లో టీ20 ప్రపంచ కప్ మ్యాచ్‌లు ఆడొద్దని బంగ్లాదేశ్ నిర్ణయించుకుంది. ఈ విషయంలో ఐసీసీ ఎలాంటి నిర్ణయం తీసుకుంటుంతో చూడాలి.






## అలా చేస్తే షమి పునరాగమనాన్ని ఎవరూ అడ్డుకోలేరు

### ఇర్ఫాన్ పఠాన్

టీమ్ఇండియా పేసర్ మహ్మద్ షమికి సెలక్టర్లు మరోసారి మొండిచేయి చూపారు. జనవరి 11 నుంచి న్యూజిలాండ్‌తో జరగనున్న వన్డే సిరీస్‌కు అతడిని ఎంపిక చేయలేదు. 2025 ఛాంపియన్స్ ట్రోఫీ తర్వాత షమికి ఏ ఫార్మాట్లోనూ భారత జట్టులో చోటు దక్కడం లేదు. దేశవాళీ క్రికెట్‌లో రాణిస్తున్నా ఇదే పరిస్థితి. ఈ నేపథ్యంలో భారత మాజీ ఆల్‌రౌండర్ ఇర్ఫాన్ పఠాన్ సెలక్టర్ల తీరును ప్రశ్నించాడు. 200 ఓవర్లు వేసి ఫిట్‌నెస్ నిరూపించుకున్నాడని, అతను ఇంకా ఏం పురోగతి సాధించాలో సెలక్షన్ కమిటీకి తెలుసని ఘాటుగా వ్యాఖ్యానించాడు. షమి ఐపీఎల్‌లో అదరగొడితే అతడి పునరాగమనాన్ని ఎవరూ అడ్డుకోలేరని ఇర్ఫాన్ పఠాన్ అభిప్రాయపడ్డాడు. 'షమి గురించి పెద్ద చర్చ జరుగుతోంది. అతని భవిష్యత్తు ఏంటి? కొన్ని మ్యాచ్‌లు ఆడి జట్టు నుంచి బయటకు వెళ్లే వ్యక్తి కాదతను. 450-500 అంతర్జాతీయ వికెట్లు తీశాడు. ఇది చాలా పెద్ద సంఖ్య. 400 కంటే ఎక్కువ వికెట్లు తీసి ఆపై జట్టుకు దూరమైతే ఫిట్‌నెస్‌పై ప్రశ్నలు లేవనెత్తడం సహజం. ఇది ప్రతి ఒక్కరికీ జరుగుతుంది. ఏ ఆటగాడైనా క్రికెట్ ఆడుతున్నంత కాలం ఫిట్‌నెస్‌ను నిరూపించుకోవాలి. కానీ, గాయం నుంచి కోలుకున్న తర్వాత షమి దేశవాళీ క్రికెట్లో 200 ఓవర్లు బౌలింగ్ చేశాడు. ఇన్ని ఓవర్లు వేసిన తర్వాత కూడా ఫిట్‌నెస్ గురించి ప్రశ్నలా?అతను ఇంకా ఏం పురోగతి సాధించాలి? అది సెలక్షన్ కమిటీకి మాత్రమే తెలుసు. నేను షమి స్థానంలో ఉంటే ఐపీఎల్‌లో విధ్వంసం సృష్టించేవాడిని. కొత్త బంతితో చెలరేగేవాడిని. దేశవాళీ క్రికెట్ ప్రదర్శనల గురించి చర్చిస్తారు. కానీ, మీరు (షమి) ఐపీఎల్‌లో ఆడి పాత రిథమ్, ఫిట్‌నెస్‌ను ప్రదర్శిస్తే ఎవరూ విస్మరించలేరు. ప్రపంచం మొత్తం ఐపీఎల్‌ని చూస్తోంది. మీరు అక్కడ ప్రదర్శన చేస్తే మళ్లీ జట్టులో మీ స్థానాన్ని సంపాదించుకుంటారు. షమి భారత జట్టులోకి పునరాగమనం చేయడానికి తలుపులు ఇంకా తెరిచి ఉన్నాయని నేను నమ్ముతున్నాను' అని ఇర్ఫాన్ పఠాన్ వివరించాడు. ఇటీవల ముగిసిన సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో షమి 7 మ్యాచ్‌ల్లో 16 వికెట్లు పడగొట్టాడు. ప్రస్తుతం జరుగుతున్న విజయ్ హజారే ట్రోఫీలో 5 మ్యాచ్‌ల్లో 11 వికెట్లు తీసి సత్తా చాటాడు.

## ఇంగ్లాండ్ జోరుకు వరుణుడి బ్రేక్

**సిడ్నీ:** ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్ మధ్య యాషెస్ సిరీస్‌లో ఇవాళ సిడ్నీలో ఐదో (చివరి) టెస్టు ప్రారంభమైంది. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన ఇంగ్లాండ్.. జాక్ క్రాలీ (16), బెన్ డకెట్ (27), జాకబ్ బెతెల్ (10) వికెట్లను కోల్పోయి 57/3తో కష్టాల్లో పడింది. ఈ దశలో జో రూట్ (72, 103 8 ఫోర్లు), హ్యారీ బ్రూక్ (78, 92 బంతుల్లో 6 ఫోర్లు, 1 సిక్స్) అర్ధ శతకాలతో జట్టును ఆదుకున్నారు. ఈ క్రమంలో జోరు మీదున్న ఇంగ్లాండ్‌కు వరుణుడు ఆటంకం కలిగించాడు. 45 ఓవర్ల తర్వాత వర్షం పడటంతో మ్యాచ్ సాగలేదు. చాలాసేపు వేచి చూసినా వరుణుడు శాంతించకపోవడంతో తొలి రోజు ఆట ముగిసినట్లు అంపైర్లు ప్రకటించారు. ఆట ముగిసే సమయానికి ఇంగ్లాండ్ 3 వికెట్ల నష్టానికి 211 పరుగులు చేసింది. బ్రూక్, రూట్ నాటౌట్‌గా క్రీజులో ఉన్నారు. ఇక, సిరీస్ విషయానికొస్తే.. తొలి మూడు మ్యాచ్‌ల్లో ఆస్ట్రేలియా గెలవగా.. నాలుగో టెస్టులో ఇంగ్లాండ్ నెగ్గింది.



## టీ20 ప్రపంచకప్ జట్టును ప్రకటించిన బంగ్లాదేశ్

### ముస్తాఫిజుర్‌కు చోటు

2026 ప్రపంచ కప్ ఫిబ్రవరి 7 నుంచి ప్రారంభంకానుంది. ఈ మెగా టోర్నీ కోసం బంగ్లాదేశ్ జట్టును ప్రకటింటించింది. లిటన్ దాస్ కెప్టెన్‌గా 15 మంది ఆటగాళ్లను ఎంపిక చేశారు. భారత్, బంగ్లాదేశ్ మధ్య నెలకొన్న ఉద్రిక్తతల వల్ల ఐపీఎల్ 2026 కాంట్రాక్ట్‌ను కోల్పోయిన ముస్తాఫిజుర్ రెహమన్‌కు ప్రపంచ కప్ జట్టులో చోటు కల్పించారు. ముస్తాఫిజుర్, తస్కిన్ అహ్మద్ పేస్ విభాగం బాధ్యతలు మోయనున్నారు. మెహదీ హసన్, రిషాద్ హొస్సేన్‌ను ప్రధాన స్పిన్నర్లుగా తీసుకున్నారు. బ్యాటింగ్‌లో లిటన్ దాస్, తంజిద్ హసన్, పర్వేజ్ హొస్సేన్ ఎమోన్‌పై బంగ్లా ఎక్కువగా ఆధారపడనుంది. ఈ ప్రపంచకప్‌నకు భారత్, శ్రీలంక సంయుక్తంగా ఆతిథ్యమివ్వన్నాయి. గ్రూప్ స్టేజ్‌లో బంగ్లాదేశ్ ఆడాల్సిన నాలుగు మ్యాచ్‌లను భారత్‌లోనే షెడ్యూల్ చేశారు. ఈడెన్ గార్డెన్స్ వేదికగా ఫిబ్రవరి 7న వెస్టిండీస్, 9న ఇటలీ, 14న ఇంగ్లాండ్, 17న వాంఖడేలో నేపాల్‌తో మ్యాచ్‌లు ఆడాల్సి ఉంది. బంగ్లాదేశ్‌లో హిందువులపై వరుస దాడుల నేపథ్యంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఈ క్రమంలో ముస్తాఫిజుర్‌ను ఐపీఎల్ 2026 కాంట్రాక్ట్ నుంచి తప్పించారు. దీంతో భారత్‌లో టీ20 ప్రపంచ కప్ మ్యాచ్‌లు ఆడబోమని బంగ్లాదేశ్ ఐసీసీ అధికారికంగా తెలియజేయాలని భావిస్తోంది.

**2026 టీ20 ప్రపంచ కప్‌నకు బంగ్లాదేశ్ జట్టు:** లిట్టన్ దాస్ (కెప్టెన్), తాంజిద్ హసన్, పర్వేజ్ హొస్సేన్ ఎమోన్, సైఫ్ హసన్, తౌహిద్ హృదయ్, షమీమ్ హొస్సేన్, క్వాజీ నూరుల్ హసన్ సోహన్, షాక్ మెహదీ హసన్, రిషద్ హొస్సేన్, నసుమ్ అహ్మద్, ముస్తాఫిజుర్ రెహమన్, తాంజిమ్ హసన్ సాకిబ్, తస్కిన్ అహ్మద్, షైఫ్ ఉద్దీన్, షోరిఫుల్ ఇస్లాం.






# ‘మన శంకరవరప్రసాద్‌గారు’ ట్రైలర్ వచ్చేసింది

చిరంజీవి కథానాయకుడిగా అనిల్ రావిపూడి దర్శకత్వంలో రూపొందుతున్న యాక్షన్ ఎంటర్‌టైనర్ ‘మన శంకరవరప్రసాద్‌గారు’. నయనతార కథానాయిక. వెంకటేశ్ కీలక పాత్ర పోషిస్తున్నారు. సంక్రాంతి కానుకగా జనవరి 12న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా ఆదివారం తిరుపతిలో నిర్వహించిన కార్యక్రమంలో చిత్ర ట్రైలర్‌ను విడుదల చేశారు. అనిల్ రావిపూడి మార్క్ కామెడీ టచ్‌తో పాటు, చిరు అభిమానులు మెచ్చేలా యాక్షన్ హంగులను సినిమాకు జోడించినట్లు ప్రచార చిత్రం చూస్తే అర్థమవుతోంది.షైన్ స్క్రీన్స్, గోల్డ్ బాక్స్ ఎంటర్‌టైన్‌మెంట్స్ సంస్థలపై సాహు గారపాటి, సుస్మిత కొణిదెల సంయుక్తంగా నిర్మించిన చిత్రమిది.  భీమ్స్ సిసిరోలియో అందించిన పాటలు ఇప్పటికే అలరిస్తున్నాయి.



## ఆ టైంలో రెడ్ లైట్ ఏరియాకు వెళ్లాను

శ్వేతా బసు ప్రసాద్ కొన్నేళ్లు ఇండస్ట్రీకి కనిపించకుండా వెళ్ళిపోయిన ఈ అమ్మడు ప్రజెంట్ బాలీవుడ్‌లో వరుస సినిమాలు, సిరీస్‌లు చేస్తూ హీరోయిన్‌గా రాణిస్తోంది.అలాగే సోషల్ మీడియాలోనూ శ్వేతా బసు ప్రసాద్‌కు సపరేట్ ఫ్యాన్ బేస్ ఉంది. ఒకప్పుడు బరువు పెరిగి బొద్దుగా కనిపించే శ్వేత ఇప్పుడు బరువు తగ్గి.. సన్నజాజి తీగలా మారింది. నిత్యం హాట్ హాట్ ఫొటోస్‌ను షేర్ చేస్తూ కుర్రకారుకు కునుకు లేకుండా చేయడంలో అమ్మడు ముందు ఉంటుంది. ఇదిలా ఉంటే.. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఈ చిన్నది ఆసక్తికర విషయాలను పంచుకుంది.ఆమె మాట్లాడుతూ.. ‘నేను లాక్ డౌన్ సమయంలో ‘ఇండియా లాక్ డౌన్ణ అనే సినిమాలో నటించాను. అందులో వేశ్య పాత్రలో నటించాను. అయితే ఈ సినిమాలో భాగంగా ముంబైలోని రెడ్ లైట్ ప్రాంతంలో నివసించే మహిళలు లాక్ డౌన్ సమయంలో ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కొన్నారు అనేది స్వయంగా తెలుసుకోవడానికి.. నేను ముంబైలోని రెడ్ లైట్ ఏరియాలోని కామాటిపురను సందర్శించాను’ అని చెప్పుకొచ్చింది. ప్రస్తుతం ఈ భామ చేసిన కామెంట్స్ నెట్టింట వైరల్‌గా మారాయి.



## ఓటీటీలో ‘అఖండ2’..

బాలకృష్ణ కథానాయకుడిగా బోయపాటి శ్రీను దర్శకత్వంలో రూపొందిన ఫాంటసీ యాక్షన్ థ్రిల్లర్ ‘అఖండ2: తాండవం’. డిసెంబరులో విడుదలైన ఈ మూవీ బాలకృష్ణ అభిమానులను విశేషంగా అలరించింది. అఘోరగా బాలకృష్ణ నటన, బోయపాటి టేకింగ్, సనాతన ధర్మం ప్రాముఖ్యతను తెలియజేస్తూ తీర్చిదిద్దిన సన్నివేశాలు అలరించాయి. ఇప్పుడు ఈ చిత్రం ఓటీటీ ప్రేక్షకులను అలరించడానికి సిద్ధమైంది. సంక్రాంతి కానుకగా ప్రముఖ ఓటీటీ వేదిక నెట్‌ఫ్లిక్స్‌లో జనవరి 9వ తేదీ నుంచి స్ట్రీమింగ్ కానుంది. ఈ విషయాన్ని తెలియజేస్తూ నెట్‌ఫ్లిక్స్ పోస్ట్ పెట్టింది. ఈ చిత్రంలో సంయుక్త, ఆది పినిశెట్టి, హర్షాలీ మల్హోత్రా తదితరులు నటించారు.

## పిచ్చి ప్రేమకు ధన్యవాదాలు

‘భర్త మహాశయులకు విజ్ఞప్తి’ చిత్రంలో ఆషిక రంగనాథ్, డింపుల్ హయాతి హీరోయిన్లుగా నటిస్తున్నారు. అయితే తాజాగా ఈ సినిమాలోని ‘వామ్మో.. వాయ్యో..’ అంటూ సాగే లిరికల్ సాంగ్‌ను మేకర్స్ విడుదల చేసిన సంగతి తెలిసిందే. సంగీత దర్శకుడు భీమ్స్ సిసిరోలియా తనదైన మాస్ బీట్స్‌తో స్వరపరిచిన ఈ పాటకు దేవ్ పవార్ సాహిత్యం అందించగా, స్వాతి రెడ్డి తన గాత్రంతో పాటకు మరింత హుషారుని తీసుకువచ్చారు. ప్రస్తుతం ఈ న్యూస్ యూట్యూబ్‌లో మిలియన్ల వ్యూస్‌తో దూసుకుపోతుంది. ఈ క్రమంలో తాజాగా ఆషికా రంగనాథ్ తన ఇన్‌స్టాగ్రామ్‌లో ఓ పోస్ట్ షేర్ చేసింది. అందులో వామ్మో వాయ్యో సాంగ్ కోసం తాను రెడీ అయినది, డ్యాన్స్ స్టెప్స్ నేర్చుకున్నది, ఈ పాట టైంలో తీసుకున్న ఫొటోలను షేర్ చేస్తూ.. ‘వామ్మో వాయ్యో.. మొట్టమొదటి మాస్ తెలుగు పాట. ఆరోగ్య సమస్యలు ఉన్నప్పటికీ, నేను నా హృదయాన్ని నింపుకుని వెనకడుగు వేయకుండా డ్యాన్స్ చేశాను. అన్ని ప్రయత్నాలు, కష్టమంతా ప్రతి పనికి విలువ.. పిచ్చి ప్రేమకు ధన్యవాదాలు .. అలాగే శేఖర్ మాస్టర్, రవితేజ, డింపుల్ హయాతీకి కూడా థాంక్యూ’ అంటూ రాసుకొచ్చింది. దీంతో ఈ పోస్ట్ కాస్త నెట్టింట వైరల్‌గా మారగా.. దీన్ని చూసిన నెటిజన్లు ఎందుకు ఇంత హాట్‌గా ఉన్నావంటూ కామెంట్స్ చేస్తున్నారు.



Printed, Published and Owned by **RAVU RAJITHA**, Printed at **KAKATHIYA PRINTERS**, LN Colony, Uppal IDA, Uppal. **Editor: RAVU NAGI REDDY**. **RAJAMUDRA PUBLICATIONS**, Peerzadiguda, Medchal - Malkajigiri Dist. Telangana - 98, **RNI NO : TELTEL/2024/86684**, Contact No :98484 83466 9182474575, MAIL ID: rajaamudranews@gmail.com